Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 21, 2006



బుధియా

వివాదంలోకి పరుగు...

హ్యాపీ బర్త్‌డే

21.5.2006 నుండి 27.5.2006 వరకు

పఠాన్ యాస్మిన్ గౌస్యా
1సం॥, మే-21
సుభాని - షాబిరా
మొగల్‌రాజపురం-విజయవాడ-10

ఎ. శ్రీ సాయిరాం
6సం॥, మే-20
జ్యోతి - కోటేశ్వరరావు
శ్రీనగర్‌కాలనీ-హుజూర్‌నగర్, నల్గొండ

మానేపల్లి రత్న ప్రత్యూష
4సం॥, మే-23
సుబ్బలక్ష్మి - ప్రభాకర్‌రావు
మద్దిలపాలెం-విశాఖపట్నం

ఇ. కిరీటి
మే-25
రమణకుమారి - శ్రీధర్
తిలక్‌నగర్-హైదరాబాద్.

కె. వాసవి
1సం॥, మే-22
వినీత - విజయ్‌కుమార్
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డిజిల్లా

రహేలానిషాత్
మే-21
నస్రత్‌ఉన్నిసా - సాబేర్
పటాన్‌చెరువు- మెదక్

డి. ప్రతీక్
మే-25
ప్రవీణ - ధర్మారావు
ఒంగోలు

సి.హెచ్ జ్యోషిత
4సం॥, మే-21
రాజేశ్వరి - ప్రభాకర్
కృష్ణలంక-విజయవాడ

సనపల కావ్య
2సం॥, మే-21
ఉషారాణి - కృష్ణమోహనరావు
ఏలూరు

ధార్మిక
1సం॥, మే-27
కళావతి - రమేష్‌రెడ్డి
తిరుపతి



అందరూ కలిసి కృషిచేయాలి...

వ్యక్తిగత విలువలమీద పెద్దగా మాట్లాడుకోలేం. సమాజంలో వుండే విలువలు, వాటిలో మార్పులగురించి మాట్లాడుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్ట్ వ్యవస్థ అంతరించాక పశ్చిమదేశాల సామ్రాజ్యవాదం బలపడింది. గ్లోబలైజేషన్ వల్ల అంతటా అవినీతి రాజ్యమేలుతోంది. ఎవరికివాళ్ళు తమ స్వార్థం చూసుకోవడమే తప్ప సమాజంపట్ల అవగాహన తగ్గిపోయింది. తోటివ్యక్తులపట్ల వుండాల్సిన సదవగాహన, దృక్పథం నశించిపోయి రాజ్యాంగంలో మనం రాసుకున్న విలువలు కూడా లెక్కచేయడంలేదు. రాజ్యాంగం ఇంకా బ్రతికేవుందిగా. ప్రతి ఒక్కరిలోనూ సెల్ఫ్ సెంటర్డ్ యాటిట్యూడ్ ఎక్కువైపోయింది. ఒక లక్ష్యం అంటూ లేకుండాపోయింది. ఇది సామాన్యులకే కాదు మేధావులకూ వర్తిస్తుంది. మేధావులు కూడా ఏమీ పట్టనట్లు వుండిపోతున్నారు. ఈ తీరు మారాలంటే, సమసమాజం ఏర్పడాలంటే అందరూ కలిసి కృషిచేయాలి.

K.G.Kannabiran

మన అతిథి గురించి...

పేరు	:	కె.జి కన్నాభిరాన్
పుట్టింది	:	మధురై, 9-11-1929
స్వగ్రామం	:	నెల్లూరు
విద్య	:	ఎమ్.ఎ., బి.ఎల్, సికింద్రాబాద్, మహబూబ్‌కాలేజ్
వృత్తి	:	న్యాయవాది
అలవాట్లు	:	క్రీడలు, పుస్తకపఠనం, రచనలు
నచ్చిన అంశం	:	ప్రజాస్వామ్యం మీద నమ్మకం, ఉద్యమం మీద నమ్మకం పరిస్థితులు ఎలా గున్నా ఒక అవగాహన ఏర్పర్చుకుంటాను పురస్కారాలపై నమ్మకం లేదు

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు... 20

ఇలా వుందామా... 7
ప్రహసనం

కథ 18
తప్పు

సీరియల్ 8
తెలుగుగడ్డ

ఇంకా...

ఆరోగ్యం ... 17
అవీ... ఇవీ ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞాన వీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

తరగని కమ్మదనం

ఈ వారం అట్టమీద కథ 'రెండక్షరాల విశ్వరూపం అమ్మ'లో అమ్మ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఎవరికైనా తల్లి చేసే సేవలు ఎనలేనివి అంటూ అమ్మ గొప్పతనాన్ని చక్కగా రాశారు. అమ్మలోని కమ్మదనం ఎన్నటికీ తరగనిది. 'ఇలా ఉందామా...' శీర్షికలోని 'ప్రేమరాహిత్యం'లో వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకునేవారు లేకపోతే బ్రతుకు ఎంత భయంకరంగా ఉంటుందో మనసుకు హత్తుకునేలా చెప్పారు. చదువుతుంటే ఎంతో బాధ కలిగింది. వారం వారం కథలు బావుంటున్నాయి. ఈ వారం 'ఆశ' కథ నాకు ఎంతగానో నచ్చింది. 'రుచి'లోని వంటకాలు, ఫొటోలు నోరూరించాయి.

డి. వాహిని, కొత్తగూడెం.

స్నేహాన్ని అందిస్తోంది...

మేథావి, విద్యాదాత, అమృతాంజనం, ఆంధ్రపత్రికదాత, కాశీనాధుని నాగేశ్వరరావు చిరస్మరణీయుడు. గుమ్మడిపండు, చిన్నారి శీర్షికలతీరు మార్చడం బాగుంది. కమ్మని అమ్మ కథ మధురంగా ఉంది. ఆలూ కారప్పూస నోరూరిస్తోంది. పనివాళ్లమీద ప్రకటించే నమ్మకం ఉదాత్తం అన్నమాట బాగుంది. కాంతారావుగారి కబుర్లు కుతూహలంగా ఉన్నాయి. ఆదివారం స్నేహ అందరికీ స్నేహాన్ని అందిస్తోంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు-2

వర్ణించదలేనివి

కవర్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'రెండక్షరాల విశ్వరూపం అమ్మ' బాగుంది. అమ్మ అనే రెండక్షరాలు మాతృత్వానికి, మానవత్వానికి దారి చూపే మార్గదర్శకాలు. నవమాసాలు కడుపులో దాచుకుని ఆనక జీవితాంతం ప్రేమగా సాకుతుంది. పిల్లలపట్ల ఆమెకున్న రాగానుబంధాలు మాటల్లో వర్ణించలేనివి. అమ్మ మాటే వేదవాక్కుగా భావించి ఆమె ఇచ్చిన జన్మను సార్థకం చేసుకోగలిగితే అంతకుమించిన ఆనందం లేదు.

మేడూరి సత్యనారాయణ, ఖైరతాబాద్, హైదరాబాద్.

హైలైట్

నేను క్రమం తప్పకుండా స్నేహ చదువుతుంటాను. సలహాలు శీర్షికలోని సమస్యలకు న్యాయవాదిగారి పరిష్కారాలు బాగుంటున్నాయి. స్నేహకు సలహాలు శీర్షిక హైలైట్. ఎందుకంటే వేల రూపాయలు ఖర్చుపెట్టి లాయర్లనద్దకు వెళ్ళకుండా పత్రికాముఖంగా పరిష్కారాలు ఇప్పించడం బాగుంది.

జానపాటి శ్రీనివాస్, సంతోష్‌నగర్, మిర్యాల గూడ.

మూఢనమ్మకాలు

ప్రతి ఆదివారం స్నేహలో వచ్చే శీర్షికలన్నీ చదువుతున్నాం. మనమూ మన నమ్మకాలు బాగున్నాయి. మారుతున్న మన సమాజంలో మూఢనమ్మకాలు పెచ్చరిల్లుతున్నాయి. దీనికి తోడు మీడియా కూడా మూఢ నమ్మకాలను ప్రోత్సహించడం బాధాకరం. ప్రజాశక్తి చేస్తున్న కృషి అభినందనీయం.

కమల, వరంగల్.

అమ్మపాత్ర

అమ్మపై వచ్చిన ముఖచిత్రకథనం చాలా బాగుంది. తల్లీపిల్లల అనుబంధంలో వుండే గాఢతను మాత్రమే చెప్పినట్లయితే అందులో విశేష మేమీ వుండేదికాదు. కానీ అమ్మపాత్రలో ఎన్ని బరువు బాధ్యతలుంటాయో, వాటిని మోస్తూ ఆవిడెన్ని కష్టనష్టాలనుభవిస్తుందో, ఎంతటి త్యాగానికైనా ఎలా సిద్ధపడుతుందో హృద్యంగా చెప్పారు. ఇంటా బయటా శ్రమిస్తోన్న అమ్మలకు మాతృత్వ మాధుర్యం అనుభవంలోకి రావా లంటే ఇతర కుటుంబసభ్యులు కూడా పిల్లల పెంపకంలో పాలుపంచు కోవాలి మరి.

కాట్రగడ్డ వెంకటేశ్వరరావు, తెనాలి.

ధన్యవాదాలు

ఈ వారం అట్టమీద కథలో అమ్మ గురించి రాయడం బాగుంది. అట్లాగే న్యాయవాది జి.ఎల్ . నరసింహారావుగారి సలహాలు కూడా స్పష్టంగా ఉంటున్నాయి. వీటిని అందిస్తున్నందుకు మా ధన్యవాదాలు.

ముల్లా ఇస్మాయిల్, కోటవీధి, కోదాడ.

ఆలోచింపచేసేలా వుంది

మే 7, 2006 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో అమ్మ గురించిన గురించిన కథనం ఆలోచింపచేసేలా వుంది. ప్రపంచంలో అత్యంత నిస్వార్థమైన, కల్మషరహితమైన ఆత్మీయ సంబంధం ఏదంటే అది తల్లీపిల్లలదే అన్నది అక్షరం సత్యం. నిజంగా అమ్మ పిల్లలకోసం ఎన్నో త్యాగాలు చేస్తుంది. ఎన్నింటినో కోల్పోతుంది. కానీ అన్నీ ఇష్టంగానే చేస్తుంది. ఆ ప్రేమ స్పర్శలో ఎన్ని ఒడిదుడుకులనైనా ఇట్టే మర్చిపోతుంది. తన పిల్లలకేదైనా ఆపదకల్గితే తల్లడిల్లిపోతుంది. అందుకే సృష్టిలో అమ్మకంటే గొప్పవారులేరు. అమ్మ తర్వాతే వేరెవరైనా. 'అమ్మ అన్నది ఒక కమ్మని మాట...' అనే సినీ గీతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం. ఆరోగ్యం శీర్షికన అవయవాలు ఎలా తీస్తారు, ఆ వివరాలన్నీ బాగా రాశారు. కరపత్రాల భక్తి ఎక్కువౌతున్న తరుణంలో దానిపై కథనం బాగుంది.

సొరెడ్డి రామచంద్రారెడ్డి, యాడికి, అనంతపురం.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్చుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3727

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

పరాభవం నుండి పుట్టుకొచ్చిన మహాత్ముడు

జ్యోతిబాఫూలే మహారాష్ట్రంలోని పూనేలో 1827 ఏప్రిల్ 11న జన్మించాడు. చిమ్నాబాయి, గోవిందరావు ఆయన తల్లిదండ్రులు. పాలుతాగే ప్రాయంలోనే పూలే తల్లిని కోల్పోయాడు. ఆయన పుట్టిన కాలంనాటికి కింది కులాలవారికి పాఠశాలల్లో ప్రవేశం లభించేదికాదు. అప్పుడున్నది అసమాన సామాజిక వ్యవస్థ. అయితే ఆంగ్లపాలకులు, మిషనరీలు అక్కడక్కడ స్థాపించిన పాఠశాలలవల్ల బడుగు వర్గాలవారికి కొంతమేరకు విద్యావకాశాలు లభించేవి. ఫూలే అలాంటి ఒక పాఠశాలలో చేరి, ఒకవైపు కాయకష్టం చేస్తూ, మరోవైపు విద్యను అభ్యసించాడు. తాను పొందిన ఆంగ్లభాషాజ్ఞానంతో పాశ్చాత్య తత్వవేత్తల రచనలు చదివి స్వేచ్ఛ, సమానత్వ భావాలను పెంపొందించుకున్నాడు.



ఇదిలా ఉండగా పూలే జీవితాన్ని సమూలంగా మార్చేసిన సంఘటన ఒకటి జరగింది. ఒకనాడు తన బ్రాహ్మణమిత్రుని ఆహ్వానంపై అతని పెళ్లి ఊరేగింపులో పాల్గొనేందుకు వెళ్లాడు. ఊరేగింపు సాగుతుండగా అక్కడుండే బ్రాహ్మణులు పూలేను గమనించి పూలే తోటమాలి కుమారుడని, కులరీత్యా శూద్రుడని దూషించారు. బ్రాహ్మణుల దృష్టిలో శూద్రులు వెలవేయదగ్గవారనీ, వారితో ఎలాంటి సంబంధమూ పెట్టుకోరాదనీ పూలేను నానా తిట్లూ తిట్టి ఊరేగింపు నుండి బయటకు గెంటేశారు. పరాభవం, బాధతో పూలే ఇల్లుచేరాడు. తండ్రి అక్కున చేర్చుకుని ఓదార్చాడు. అయినా పూలే శోకం ఆగలేదు. ఆరాత్రి నిద్ర కూడా పట్టలేదు. కులంపేరుతో అగ్రవర్ణాలవారు పాటిస్తున్న కులవివక్షను ఎలా నిర్మూలించాలా అని ఆలోచించాడు. అనాదిగా అగ్రవర్ణాల దురన్యాయానికి బలైపోతున్న కింది కులాలవారిని ఉద్ధరించాలనుకున్నాడు. కిందికులాలవారు అనుభవిస్తున్న దయనీయ జీవితాలను వారి పూర్వజన్మ కర్మఫలాలుగా భావించి, మౌనంగా రోదిస్తున్నవారిని మేల్కొలిపి చైతన్యాన్ని రగిల్చి, బడుగు జనోద్ధరణకు పురికొల్పింది పైన పేర్కొన్న సంఘటన.

పూలే అనుసరించదల్చుకున్న ముఖ్యమైన మార్గం కిందికులాలవారికి విద్యావకాశాలను కల్పించడం. విద్యద్వారా వ్యక్తుల మనోభావాలను విశాలపర్చవచ్చు. వారిని విజ్ఞానవంతులుగా చేయొచ్చు. విద్య విచక్షణాజ్ఞానాన్నిచ్చి, జీవితంలో గౌరవంగా బతకడానికి మార్గాన్ని చూపుతుంది. విద్యను సకల సామాజిక రుగ్మతలకు విరుగుడుగా భావించాడు పూలే.

పూలే కార్యరంగంలోకి దిగి ఆడపిల్లలకోసం పాఠశాల ప్రారంభించాడు. మహారాష్ట్రలో తొలి బాలికా పాఠశాలను స్థాపించిన ఘనత ఈయనదే. బాలికల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయినుల కొరత గమనించిన జ్యోతిబా, తన భార్య సావిత్రీ పూలేకు చదువు చెప్పి, విద్యావంతురాల్ని చేసి తాను స్థాపించిన పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేర్చుకున్నాడు.

19వ శతాబ్దపు సంస్కర్తలు చేపట్టిన వితంతు పునర్వివాహాలు, బాల్యవివాహాల నిషేధం, దిక్కులేని వితంతు స్త్రీలకు శరణాలయాలు స్థాపించడం మొదలైన సంస్కరణలను కొనసాగించాడు. 'సత్యశోధక్ సమాజ్'ను స్థాపించి దాని తరపున సంస్కరణల కొరకు కృషి చేశాడు. వెనకబడ్డ కులాల ప్రజలకోసం శ్రమించినవారిలో జ్యోతిబాపూలే ప్రథముడు. మహాత్ముడిగా బిరుదు పొందిన ఫూలే అంబేద్కరుకు మార్గదర్శకుడు. *





సాక్ష్యం

మాది ప్రేమవివాహం. 92లో దైవసాక్షిగా వివాహం చేసుకున్నాం. నా పెళ్లికి ఎవరూ సాక్ష్యం లేరు. కొన్నాళ్లు ఇంట్లో చెప్పకూడదనుకున్నాం. కానీ కొంతకాలం తర్వాత అతను వేరే ఊరెళ్లిపోయాడు. 94లో మరొక పెళ్లిచేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. 10సంవత్సరాలయ్యాక భార్యపై ఎలాగో బ్రోతల్ కేసు బనాయించి వదిలించుకుని పిల్లలను తనే ఉంచుకున్నాడు. మరో ధనవంతురాలిని చేరదీసి మూడో పెళ్లి చేసుకున్నాడు. తెలివితక్కువతనంతో మోసపోయాను. ఇలాంటి వాణ్ణి శిక్షించాలని ఉంది. అతనికి నాతో పెళ్లయినప్పుడు ప్రేమతో రాసిన ఉత్తరాలు నా దగ్గరున్నాయి. అంతకుమించిన సాక్ష్యం ఏదీ లేదు. మా పెళ్లి గురించి తెలిసిన ఏకైక సాక్షి నా స్నేహితురాలు ఈ లోకంలో లేదు. కాబట్టి నేను ఆ ఉత్తరాలతో అతనిపై చర్యతీసుకోగలనా? తగిన సలహా ఇవ్వగలరు

శ్రీ రాధిక, నర్సీపట్నం.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

మీరు 1992లో పెళ్ళి చేసుకుని ఇప్పటివరకు వేచి వుండి అంటే రెండో పెళ్ళి చేసుకున్నప్పుడు మీరేం మాట్లాడకుండా ఉండి మూడో పెళ్ళి చేసుకున్నప్పుడే శిక్షించాలని అనుకోవడం ఏమిటి? కోర్టు మీరంటున్నదాంట్లో ఏదైనా దురుద్దేశం ఉందని భావించవచ్చుకదా. ఏదేమైనా మీరు పోలీసు కేసు, మరో పెళ్ళి చేసుకున్నందుకు చీటింగ్‌కేసు పెట్టవచ్చును. మీ వద్ద ఉన్న ఉత్తరాల్లో వున్న దస్తూరి అతని చేతిరాతేనని తెలితే అతడికి శిక్షపడే అవకాశం ఉంది.





ఇంద్రగంటి జానకీబాల

వీడియో విన్యాసం

ఆ రోజు పెళ్లి వీడియో గురించి వేడివేడి చర్చ జరిగింది. 'పెళ్లికి వీడియో అవసరమా?' అని కొందరు యువతీయువకులు అభిప్రాయం వ్యక్తంచేయగా కాస్త వయసు మళ్లినవాళ్లూ, ముసలివాళ్లూ వీడియో వుండితీరాలని తీర్మానించారు. అక్కడ కూర్చున్నవాళ్లంతా మధ్యతరగతివాళ్లే. లేని గొప్పతనం చాటుకునే మనస్తత్వం కలవాళ్లూ, మనకి లేదంటే ఎక్కడ తక్కువగా చూస్తారో అన్న భయం కలవాళ్లూనూ.

ఇంతకీ ఇదంతా ఎక్కడో తెలుసా? భారతి పెళ్లి ఏర్పాట్లలో వచ్చిన సంభాషణ. కొందరమ్మాయిలు వీడియో ఒక స్టేటస్సింబలనీ, అదీ లేకుంటే చిన్నతనంగా ఉంటుందనీ ఘంటారావంగా చెప్పారు. వాళ్లని వ్యతిరేకించాలనే ఉత్సాహంతో "వీడియో పట్టి దండగ. అది చూసుకుంటూ కూర్చుంటామా? మనకి వి.సి.ఆర్‌లు, డి.వి.డి ప్లేయర్లు ఉండనే ఉండవే" అన్నారు కొందరు మగపిల్లలు.

"చాల్లే మీ కబుర్లు. డి.వి.డి. ప్లేయరులేని ఇల్లేలేదు ఈరోజుల్లో" అని ఆడపిల్లలు కొట్టిపారేశారు.

"ఫొటో ఆల్బమ్ హాయిగా ఉంటుంది. ఒంటరిగా ఆనాటి దృశ్యాలు చూసుకోవచ్చు" అన్నారెవరో...

"అదీ ఉంటుంది. కానీ వీడియోలేని పెళ్లి ఒక పెళ్లేనా... " అన్నారంతాకలిసి.

వీడియో ఆసామి ఐదువేలడిగితే మూడున్నరకి దింపి ఫిక్స్‌చేశారు.

పెళ్లిలో ముఖ్య ఘట్టాలు చిత్రీకరించి దాని వెనుక తగిన సినిమాపాటలు ముద్రించాలని ఇంటివారి ఆశ. దానికోసం కొన్ని సినిమాపాటలు ఎంపిక చేయడానికి అమ్మాయిలబృందం హడావిడి మొదలెట్టింది.

'బంగారు బొమ్మ రావేమే... పందింట్లో పెళ్లి జరిగేనే...'

'సీతారాములకల్యాణం చూతము రారండీ...'

'పోయిరా మాయమ్మ పోయిరావమ్మా...' అంటూ అన్ని ఘట్టాలకూ పాటల్ని ఎంపికచేశారు.

భారతి తండ్రి ఊపిరి పీల్చుకున్నాడు. తన కూతురి పెళ్లిటేపులో అన్నమాచార్య కీర్తనలు కూడా చేర్చగలిగితే బావుంటుందని ఓ సలహా ఇచ్చాడు. వీడియో అబ్బాయి అయోమయంగా ముఖంపెట్టి 'సరేనండి' అన్నాడు.

పెళ్లికూతుర్ని చేసినప్పటి నుంచి వీడియో మొదలయ్యింది. అనుకున్నట్టుగానే వాళ్లు చెప్పినట్టు షూట్‌చేస్తూ పోతున్నాడు వీడియో కెమెరా అబ్బాయి. అయితే సంప్రదాయసిద్ధంగా జరుగుతున్న పెళ్లిలో ఘటనలు కెమెరాకోసం ఒకటిరెండుసార్లు రిపీట్ చేయాల్సొస్తోంది. మరి వున్నదున్నట్టుగా కాకుండా అందంగా, అమర్చినట్టు పడాలంటే సినిమా షూటింగ్‌లా కొన్ని జాగ్రత్తలు తీసుకోక తప్పదు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు– వాళ్లపక్కనున్నవారందరి దృష్టి వీడియో మీదనే. ప్రతివాళ్లూ తాను బాగా పడతానో లేదోనని సర్దుకునేవారే... దండలు, హారతి, తలంబ్రాలు సరేసరి. అన్నీ రెండుసార్లు, మూడుసార్లు చేసి వీడియో బాగా వచ్చేలా అందరూ సహకరించారు. చెమటలు కక్కే ముఖాలూ, కుంకుమ, గంధం మెత్తుకున్న అవతారాలూ అత్యంత సహజంగా కెమెరాలో బంధింపబడ్డాయి.

పెళ్లి ఘనంగా ముగిసింది. మూడురోజుల తర్వాత టేప్ తెచ్చిచ్చి, మిగిలిన డబ్బులు తీసుకుని వెళ్లాడు వీడియో అబ్బాయి. భారతి తండ్రి తెలిసున్న వారందరినీ అడిగినా... వి.సి.డి ప్లేయర్ దొరకడానికి ఒక రోజంతా పట్టింది.

ఇంట్లో అందరూ కూర్చున్నారు. పక్కింటివాళ్లు, రాత్రి పెళ్లి సరిగా చూడలేని ముసలివాళ్లూ శ్రద్ధగా కూర్చున్నారు. మొదలైందిటేపు... అయితే షామియానా తాళ్లూ... ఖాళీ కుర్చీలూ... కొందరి పాదాలూ... మరికొందరి చీరంచులూ... కొందరి మెడలూ... కొందరి నడుములూ మాత్రమే కనిపించాయి. ఏ ఒక్కమనిషీ పూర్తిగా కనిపించలేదు. సగం తిన్న విస్తర్లూ... చేతులు నాకుతున్నవాళ్లూ... కిందపడిదొర్లుతున్న ప్లాస్టిక్ గ్లాసులూ... వీటికి జతకలిశాయి. చూసినవాళ్లు చాలామంది నిరుత్సాహపడ్డారు. కొందరు సిగ్గుపడ్డారు. మరికొందరు ఆ చీరంచులనూ, సగంసగం కనపడుతున్న శరీరభాగాలూ ఎవరివో గుర్తుపట్టి వారిని ఆటపట్టిస్తున్నారు. బాగా వయసుమళ్లిన ముసలివాళ్లు మాత్రం తమనుతాము చూసుకుని ఆనందపడ్డారు. ఒకావిడ ఉండబట్టలేక "రేపు మనం పోయినా చూసుకోడానికి ఇందులో ఉన్నామన్నమాట" అంది. ఎంతో కష్టపడి ఇచ్చిన పోజులన్నీ వృథా అయిపోయాయని అమ్మాయిలు బాధపడ్డారు.

"ఇదేమిటీ... వీడియో ఏం బాగాలేదు..." అన్నారంతా.

"ఐదువేలకి తక్కువ రాదంటే... తెగ బేరమాడి ఒప్పించారు కదా! అందుకని కొత్తగా వచ్చిన అసిస్టెంట్‌ను పంపాడట. పిండికొద్దీ రొట్టె అని ఊరికే అన్నారా?" అన్నాడు అసలు సంగతి తెలిసినాయన పక్కనున్న వ్యక్తితో మెల్లగా.

"అదా సంగతి... అతను చేసిందాంట్లో మాత్రం తప్పేంవుందిలే.. ధర లేకుండా నాణ్యత రమ్మంటే ఎలా వస్తుంది?" అంతే మెల్లగా బదులిచ్చాడు రెండో వ్యక్తి.

"కాస్త ఇమ్మెచ్యూర్‌గా ఉందిగానీ... అన్నీ వచ్చాయండీ..." అంటూ సమర్థించుకున్నాడు వీడియో వీరుడు.

చివరిగా పెళ్లికూతురి తండ్రి కోరిక మేరకు ఒక అన్నమాచార్య కీర్తన అందులో ఇరికించాడు. అదేమిటంటే

"నానాటి బతుకూ నాటకమూ...
కానుక కన్నది కొవల్యమూ..."

అని సరిపెట్టాడు.

పుట్టుటయు నిజము... పోవుటయు నిజము... అంటుంటే అందరూ దిక్కులు చూస్తూ కూర్చున్నారు. పాపం... దీనిగురించి ఏమీ తెలీని ఆ వీడియోకుర్రాడు మాత్రం ఏంచేస్తాడు?

✻

ఇలా వుందామా...

ప్రహసనం

వి. నాగరత్న

"ఏం వదినా, బాగున్నావా? భోజనం అయిందా?.. కూరేంటి?.. నేనా, పప్పులో ఆక్కూరపడేశా.." అనే మాటలు పెద్దపెద్దగా వినిపించడంతో పక్క ఫ్లాటావిడ కిటికీలోంచి, పై ఫ్లాటాయన తమ బాల్కనీలోంచి తొంగి చూశారు. కనకం కార్డ్‌లెస్ చెవికానించుకుని బాల్కనీలో అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు పచార్లుచేస్తూ మాట్లాడ్డం గమనించారు.

పక్క బిల్డింగులో టెర్రస్‌మీద బట్టలారేస్తోన్న పనిమనిషి 'పప్పులో ఆక్కూర కాకపోతే ఆనపకాయ వేసుకోగానీ, అవన్నీ అంతపెద్దగా మాట్లాడాలా చోద్యం కాకపోతే' అనుకుంది.

❊ ❊ ❊

"ఏరా శేఖరం, ఇంతకీ ఎప్పుడొస్తావురా?.. ఏంటీ, మేమే రావాలా? మీ అమ్మకు ఆ ఊరి నీళ్ళు పడవని తెలిసీ అలా అంటావే.. వచ్చే నెల్లోనా?.. అబ్బే ఆ పప్పులేం ఉడకవు, రేపు శనివారం శలవుపెట్టి బయల్దేరు. ఆదివారం ఉదయానికల్లా ఇక్కడుండాలి.. రద్దీ ఎక్కువా లేదు, గోంగూరా లేదు.. నీ తిప్పలేవో నువ్వు పడి రా.. మరి రిజర్వేషన్ చేయించుకోవాలని ముందు తెలీలేదా?.. ఇవన్నీ నాకు చెప్పొద్దు..." ఈ వరసన అరుస్తున్న రామ్మోహన్ మాటలు ఆ సెక్షన్ వాళ్ళకే కాదు పక్క సెక్షన్‌వాళ్ళకీ వినిపిస్తుండటంతో ఎవరికి వాళ్ళే లోలోపల విసుక్కుంటున్నారు.

'ఈయనగారికి టెలిఫోన్ అవసరమా? ఆ వైర్ పీకేసినా ఆ ఊరిదాకా వినిపిం చేట్లు అరుస్తున్నాడు మహాను భావుడు' అని గొణిగిన సుదర్శన్‌కి వత్తాసుగా అందరూ అర్థవంతంగా నవ్వేరు.



❊ ❊ ❊

"ఒరేయ్ రఘూ, ఇంకా బయల్దేర లేదా? ఎంతసేపురా? మాణింగ్ షో కాస్తా మాట్నీ అయ్యేట్లుంది... త్వరగా రారా బాబూ" అన్నాడు అవతల్నుంచి కల్యాణ్.

"ఎవరదీ?" రఘూ తండ్రి ఉరిమినట్లు ప్రశ్నించడంతో నాలుక్కరుచుకుని ఫోన్ పెట్టేశాడు కల్యాణ్.

రఘు తండ్రి కొడుక్కు చాలా పెద్ద క్లాసే తీసుకున్నాడు. దాంతో రఘుకు బుర్ర వాచి పోయింది. తండ్రిని ఆఫీసుకు వెళ్ళనిచ్చి కల్యాణ్‌కి ఫోన్‌చేసి ఛడామడా తిట్టాడు.

"ఏమో, మీ నాన్న ఫోనెత్తే సంగతి నాకేమన్నా కలొచ్చిందా? ఎప్పుడూ నువ్వే ఎత్తుతావుగా" అని నసిగేసరికి, "బుద్ధి లేకపోతే సరి.. ఎవరు మాట్లాడ్తున్నారో, ఏంటో తెలుసుకోకుండా బడబడా వాగేయడమేనా? నువ్వు చేసిన నిర్వాకానికి ఇక మా నాన్నకి రోజూ సందేహమే వచ్చేట్లుంది.. నేను క్లాసులెగ్గొట్టి సినిమాలకెళ్తానని" అంటూ కారాలూమిరియాలూ నూరాడు.

❊ ❊ ❊

సుందర్రావు ఫీల్డ్‌వర్క్‌కెళ్తూ సెల్‌ఫోన్ ఆఫీసులో మర్చిపోయాడు. అది రెండుమూడుసార్లు మోగినా తమకెందుకులెమ్మని ఎవరూ లిఫ్ట్ చేయలేదు. మరోసారి మోగేసరికి "పాపం, ఏం పనిమీద చేస్తున్నారో ఏంటో, విషయం చెబ్దామని పక్క సీటాయన బటన్ ప్రెస్‌చేసి "హలో" అన్నాడో లేదో "ఏం ఫోన్ ఎత్తకుండా ఎక్కడ అఘోరించారు ఇంతసేపు?... సరేగానీ మన పక్కింటివాళ్ళు బొంబే వెళ్తున్నారట.. నాలుగు చీరలు తెప్పించుకోనా?.. ఏం మాట్లాడరే.. నోట్లో ఏమైనా కరక్కాయుందా?.. అవునో కాదో ఏదో ఒకటి చెప్పండి..." అంతవరకూ విన్న పెద్దమనిషి "మరి.. సుందర్రావు.. ఫోన్ మర్చిపోయి ఆఫీసుకెళ్ళాడు.." అని చల్లగా చెప్పేసరికి సుందర్రావు భార్యకి గొంతులో వెలక్కాయ పడింది.

❊ ❊ ❊

ఇవి మచ్చుకు మాత్రమే. ఇలాంటి ఇంకెన్నో ప్రహసనాలు నిత్యం మనకళ్ళపడుతుంటాయి. సెల్‌ఫోన్లొచ్చాక ఇళ్ళు, ఆఫీసులనుండి రోడ్ల మీదిక్కూడా పాకింది. ఎంత దూరానున్న వాళ్ళతోనైనా పక్కనే వున్నట్లు మాట్లాడు కునే వీలు కల్పించే టెలిఫోన్ చాలా అవసరమైన సాధనం. కానీ ఆ ఫోన్ ఎలా వినియోగిం చుకోవాలో చాలామందికి తెలీదు. ఎన్నోసార్లు ఎదుటివాళ్ళను పట్టించుకోకుండా పెద్ద పెద్దగా మాట్లాడేస్తుంటారు. రిసీవర్ చాలా దగ్గరగా పెట్టుకుంటే ఎంత చిన్నగా మాట్లాడినా అవతలివారికి స్పష్టంగా వినిపిస్తుంది. మౌత్‌పీస్ దూరంగా వుంటే ఇక్కణ్ణించి అరిచీ ప్రయోజనం వుండదు. మన మాటలు ఇంకొకరు న్యూసెన్స్ అనుకోవడం ఎంత బాధాకరం? మరి అలా వేలెత్తి చూపించుకునేలా చక్కగా, మెల్లగా మాట్లాడలేమా? అలాగే అవతల ఎవరు ఎత్తుతున్నారో తెలీకుండా డైరెక్టుగా మాట్లాడేస్తే ఒక్కోసారి ప్రమాదం కూడా. ల్యాండే కాదు మొబైల్ కూడా ఏదో కారణాన వేరొకరు ఎత్తి మాట్లాడే అవకాశం లేకపోలేదు.

మరి మృదుమధురంగా, వీలైనంత సంక్షిప్తంగా మాట్లాడేందుకు ప్రయత్నిద్దామా? మన పెదాల కదలిక తప్ప పక్కవాళ్ళకు మాటలు వినిపించకుంటే, క్లుప్తంగా మాట్లాడ్తే ఫోన్ సవ్యంగా వాడుకున్నట్లు. అప్పుడు బిల్లూ తక్కువొస్తుంది. లాంగ్‌రన్‌లో కూడా చెవులు పాడవవు.

❊

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(యాదవరెడ్డి పాటకు తక్కిన యువకులంతా లయతప్పకుండా నాట్యంచేస్తుండగా ప్రతాప్‌రెడ్డి వచ్చి 'జిల్లా కమిటీ నుండి ఆదేశం వచ్చింది. మన గ్రామంలో ఒక దళం ఏర్పాటు చేసుకుని త్వరలో కార్యరంగంలోకి దిగాలని ఉంది' అని చెప్పాడు.)

(18 వ భాగం)

"భయమేస్తోందా కైలాసం?" అడిగాడు ప్రతాప్‌రెడ్డి.

"మీరందరూ వుండగా నాకొక్కడికే భయమేమిటి? అదికాదు. నిరుడు పోచారం పాటిమీద కల్లు రాని చెట్లను నరికినందుకే కాబూరువారికి నూటయాభై రూపాయలు జరిమానా పడ్డది. అదీ నేననేది" అన్నాడు కైలాసం.

"సర్కారీని గురించి మనం ఆలోచనలు సలుపుతూ కూర్చోడం ఇప్పుడు మనకనవసరం. పైవారి ఆదేశానుసారం కార్యోన్ముఖులమవడం మన కర్తవ్యం" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

ఇంతసేపటినుండి ఆలోచనల్లోపడి కొట్టుమిట్టాడుతున్న యాదవరెడ్డి ప్రతాప్‌వైపుకు చూశాడు.

"ప్రతాప్, ఇప్పుడు మాగాణి పనుల రోజులుగదా? ఇప్పుడే సంగం కార్యకలాపాలను అమలు జరపడమెలాగా అని నా సందేహం" అన్నాడు.

"అవును దమ్ములు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పుడు మనకు తీరిక ఉండదు" అన్నాడు మల్లారెడ్డి.

"పగలల్లా బురదలో కొట్టుకుని రాత్రిళ్లు ఇటు బయలుదేరడం సాధ్యమయ్యేపనిగాదు" అన్నాడు కృష్ణారెడ్డి. మిగతావారందరూ వారి మాటలనే బలపరిచారు. ప్రతాప్‌రెడ్డికి కూడా వారి మాటలు సబబుగానే కనిపించినయ్.

"సరే యాదవా ఈ నాలుగు రోజులు ఆగుదాంలే. ఈ విషయం కమిటీవారికి తెలియజేస్తాను" అన్నాడాయన.

"సరే ప్రతాప్ అలాగే తెలియజేయి" అన్నాడు యాదవరెడ్డి.

తర్వాత అందరూ లేచారు. ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారు.

❖ ❖ ❖

దీపంవద్ద కూర్చుని వారపత్రిక చదువుకుంటున్న అఖిలాండం భర్త లోపలికొస్తున్న అడుగుల చప్పుడు విని లేచింది.

"ఎక్కడికి వెళ్లారూ? మీకోసం అలాగే కూర్చున్నా"

"ఇంకా భోజనం చేయలేదా నువ్వు?" అడిగాడు ప్రతాప్‌రెడ్డి.

"మీ కోసమే ఉన్నాననడంలేదూ?" అందామె.

"అందరి భోజనాలు అయినాయా?"

"అయిపోయినయ్. ఇక మనమిద్దరమే ఉన్నాం. పదండి. ముందు మీకు పెడ్తాను" అందామె.

ఇద్దరూ కలిసి లోపలికెళ్లారు. ప్రతాప్‌రెడ్డి కాళ్లు కడుక్కుని వచ్చి పీటపై కూర్చున్నాడు. అఖిలాండం అన్నం పళ్లెం తెచ్చి ముందుంచింది.

"చూడు అఖిలా, ఒక మాట చెప్తాను వింటావా?" అన్నాడాయన.

"చెప్పండీ" అందామె నవ్వుతూ.

"ఎప్పుడైనా నేను బజారుకెళ్లినప్పుడు తిరిగి రావడానికి కాస్త పొద్దుపోతుంది. అప్పటిదాకా నీవు భోంచేయకుండా ఉండడమెందుకు? అది మంచి పద్ధతి కాదు"

"ఈమాటేనా మీరు చెప్పేది? ఇంకేదో మాటనుకున్నాను. సరేలెండి" అంటూ ఆమె తిరిగి నవ్వింది.



"అదిగాదు అఖిలం.. నాకోసం నీవు తిండి మానుకుని కూర్చోడం ఎందుకూ అని?"

"అబ్బా పోనిద్దురూ, మీరు తినకముందే నే తింటానేమిటి? అది సరేగానీ మీకొక మంచిమాట చెప్తాను వింటారా?"

"ఏమిటో చెప్పు?"

"మీకు డబ్బు కావాలేమో నాన్న అడగమన్నాడు"

ప్రతాప్ నవ్వి "పోనిద్దూ ఇప్పుడెందుకు?" అన్నాడు.

"పై చదువులకెళ్లడం మీకిష్టం లేదా?"

"ఇష్టంలేకేం? పరిస్థితులనుకూలించక"

"ఇంకా పరిస్థితులు అనుకూలించ కపోవడమేంటి? మీకవసరం ఉన్నంత డబ్బు నాన్న ఇస్తానంటున్నాడు కదా?" అందామె.

అతడు తలూపి తలొంచుకుని భోంచేస్తున్నాడు.

"మాట్లాడరేమిటి?"

తిరిగి అడిగిందామె.

అతడామె వైపు వారగా చూసనవ్వాడు. ఆమె బుగ్గపై ఎడంచేతివేళ్లతో చిటికెలేశాడు. "నీదంతా తొందర స్వభావం" అన్నాడు.

"చాల్లెండి నేనేం తొందర

పడ్డాను?" అంటూ కోపాన్ని నటించింది. చెంపకు చేయిపెట్టుకుని నిమురుకుంది.

"బంగమూతి పెట్టావు ఇంతమాత్రానికేనా?" అన్నాడు ప్రతాప్. చేతిలో ముద్దను ఆమె నోటిలో కుక్కాడు. ఆమె కాసేపు గిజగిజలాడి చివరికి మింగేసింది.

"అబ్బబ్బా ఏం పనులండీ ఇవి?" అందామె.

"ఏం పనులా? రౌడీపనులు" అన్నాడు నవ్వుతూ. ఆమె నవ్వింది.

అతడూ నవ్వాడు. ఆమె చేతిని పట్టుకుని బలవంతంగా పళ్లెంలో ఉంచాడు.

"ఏమిటండీ?" అంటూ నసిగిందామె.

"తప్పుగాదూ?"

"తప్పని ఎవరన్నారు?"

"అబ్బబ్బా మీతో ఎట్లామరి?"

"ఇద్దరం కలిసి భోంచేద్దాం. అప్పుడీ పేచీలేమీ ఉండవు"

"ఎవరైనా చూస్తారండీ"

"ఎవరైనా చూస్తారని తినకుండా మానుకుంటామా ఏమిటి?" అన్నాడతను. ఆమెచేయి పట్టుకుని బలవంతం చేశాడు. బతిమిలాడాడు. చివరికామె సమ్మతించింది. ఇరువురూ కలిసి భోంచేశారు.

❖ ❖ ❖

తూర్పు కొండల్లో నుండి అప్పుడే పొద్దుపొడిచి వస్తుంది. పటేలు అయోధ్యరాంరెడ్డి వంకీకర్ర చేతికి తగిలించుకుని మెడకు రెండుపక్కల కండువాను జీరాడవేసుకుని వీధిన బయలుదేరాడు. ఆయన్ను చూడగానే పెద్దిరెడ్డి పొలికట్టనాపి నిలబడ్డాడు.

"పటేలుగారు పొద్దున్నే బయలుదేరారు" అంటూ పలకరించాడు.

"మాగాణి వేతకొచ్చిందోయి. వాడదాకా వెళ్ళొద్దామని బయలుదేరాను" అన్నాడు పటేలు.

"ఈమద్దెన ఒకమాట పుట్టింది మీరు విన్నారా?"

"ఏమిటదీ?"

"కూలిరేటు పెరిగితేనే వేతకు వస్తామని అంటున్నారట వాడజనం"

పటేలు తలను పక్కకువాల్చి హుందాగా నవ్వాడు. మీసం మెలిపెట్టాడు.

"అంటారంటే అనరోయ్? కాలికింద ఉండేవాళ్ళను తెచ్చి నెత్తికెక్కించుకుంటున్నాం. చేతులారా చేసుకున్నదానికి ఫలితం అనుభవించొద్దూ? అయినా నాకేమిటి?" అన్నాడు. రెండడుగులు ముందుకువేసి ఆగిపోయాడు.

పెద్దిరెడ్డి తలూపాడు. "నిజమే పటేలుగారూ, వెట్టి చట్టం కింద కొంతకాలం మీకూరికే చేసి పెద్దారు గదా? ఎటొచ్చీ మాకే ఈ ఇక్కట్లన్నీ" అన్నాడు.

"ఇందులో ఇక్కట్లు ఏమున్నయిలే. మీరూ వాళ్లూ ఒక్క సంగంలో చేరినవాళ్లేనాయే. లేనివాళ్లుగదా. నాలుగిత్తులెక్కువే పారేయండి" అంటూ నవ్వాడు.

"ఏమి సంగాలో ఏమి చట్టుబండలో మా పోరడు చెప్పినా వినడంలేదు పటేలుగారూ"

"ఇప్పుడెందుకు వింటాడు? తల తగిలినవాడే తలపట్టి చూసుకుంటాడు. పోనీ వాడిష్టప్రకారమే నడవనీ"

"నేను అదే అనుకున్నా. ఇక చెప్పడం, చెయ్యడం మానుకున్నాను. అంతా వాడిష్టానికే వదిలి ఊరుకున్నాను"

"సరే" అంటూ పటేలు తలూపుతూ ముందుకు కదిలాడు. సరాసరి నాలుగంగల్లో వాడ చేరుకున్నాడు. ముఠామేస్త్రి రూబేను ఇంటిముందు నిలబడ్డాడు.

"రూబేనూ" అని కేకపెట్టాడు.

మరుక్షణమే లోపలినుండి రూబేను పరుగెత్తుకొని వచ్చాడు. చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు.



"దొరలు పొద్దున్నే దయచేశారేమిటి?" అన్నాడు.

"మాగాణి నాలుగెకరాలు వేతకు వచ్చిందిరా?"

రూబేను తలూపాడు. మరుక్షణమే తలొంచుకున్నాడు.

ఎంతకూ అతడి నుండి సమాధానం రాకపోయేసరికి "మాట్లాడవేమిట్రా రూబేనూ?" అన్నాడు పటేలు.

"అందరినీ పిలువనంపి చెప్పండి"

"అదేమిట్రోయ్ కొత్తగా మాట్లాడుతున్నావు?"

"కొత్తగానే ఉంది దొరా? నా పెత్తనం సాగినన్ని రోజులు సాగింది. ఇప్పుడంతా కుర్రకారు నాయాళ్లు ఎక్కొచ్చారు. ఒక్కరూ నామాట వినేవాడులేడు. మరీ పెద్దమాదిగ కొడుకు సుందరిగాడు పట్టపగ్గాల్లేకుండా పోతున్నాడు"

"ఇప్పుడు ముఠామేస్త్రి వాడా?"

"అవును దొరా నన్ను తీసిపారేసి అందరూ కలిసి వాణ్ని మేస్త్రి కింద పెట్టుకున్నారు"

పటేలు కాసేపు ఆలోచనలో పడ్డాడు. చివరికి రూబేనును వెంటబెట్టుకుని సుందరం ఇంటిముందుకొచ్చాడు. అప్పటికే సుందరం, ఇంకో ఇరవైమంది యువకులు గొడ్డళ్ళు భుజాన పెట్టుకుని ఎదురొస్తూ తారసిల్లారు.

"ఎక్కడికిరా సుందరం గొడ్డళ్లతో బయల్దేరారు?" అనడిగాడు పటేలు.

సుందరం నిలిచిపోయాడు. అతడితోపాటు మిగతా యువకులందరూ నిలబడ్డారు.

"కోపు కొట్టుడుకు ఎల్తున్నామండీ" అన్నాడు సుందరం.

"ఇప్పుడు కోపు కొట్టుడేమిట్రా? మాగాణి పొలమంతా ఒకవైపున వేతకు వస్తుంటేనూ?"

"కాలానికీ, కరువుకూ ఆ కోపు పుణ్యమా అంటూనే కాసిని గంజినీల్లు తాగుతున్నాం గదండీ"

"అయితే ఈ సంవత్సరం వేతలకు రారా ఏమిటి?"

"రాక బతికేదెట్లాలెండి? కాని కోపు పనిలోనే నాలుగు డబ్బులొస్తున్నాయ్"

"మీ మాటలు వేరుగా కనిపిస్తున్నాయ్. అసలు మీ కడుపులో ఉన్న ఉద్దేశమేమిటో బయటపెట్టండి"

"వేరే చెప్పేదేముంది? అవతల కాస్తాకూస్తో కూలిపడతాంది. ఆ మాత్రం కూలి తమరే ఇప్పిస్తానంటే రేపటినుండే వేతకొస్తాం' అన్నాడు సుందరం.

ఇంతక్రితమే పెద్దిరెడ్డి అన్నమాటలు చాయదగుల్తున్నయ్. లోలోపల ఎంతగానో మండిపడ్డాడు. పైకిమాత్రం అతి శాంతంగా నవ్వాడు. "ఇంతకూ ఏమివ్వమంటారో తేల్చండోయ్" అన్నాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

నాగరాజు కోలా

ఇంటికంటే హాస్టల్ బెటర్

"హమ్మయ్యా...! పరీక్షలైపోయాయి. ఎంచక్కా ఇంటికెళ్లి కొన్నాళ్లు సరదాగా గడపొచ్చు" అని క్యాంపస్‌లో విద్యార్థులు ఊపిరితీసుకుంటారని మనమంతా అనుకుంటాం. కాని ఇది కొన్నాళ్ల... కాదు...కాదు... కొన్నేళ్ల కిందటి మాట. నేటి యువత సెలవులనగానే ఇంటికెళ్లటానికి ఎగిరిగెంతేస్తుందనుకుంటే తప్పులో కాలేసినట్లే. అందునా ఇంటికెళ్లటానికి వెనుకడుగేసేవాళ్లలో అమ్మాయిలే ముందున్నారంటే ఇంకా ఆశ్చర్యం కలుగక మానదు. ఆశ్చర్యపడితే పడండి కానీ ఇది నిజ్జంగా నిజం. అందుకే ఇప్పుడు కూడా లేడీస్‌హాస్టల్ పరిసరప్రాంతాల్లో సెలవుల వాతావరణం కన్పించడం లేదు. సెలవులొచ్చినా అనలెందుకు ఇంటికెళ్లడంలేదో తెలుసుకోవాలనుందా...? అయితే ఆలస్యమెందుకు వాళ్లనే అడిగి తెలుసుకుందాం.

లేడీస్‌హాస్టల్ ముందు చాలామంది అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. ఒకప్పుడు నేనూ క్యాంపస్‌లో ఉన్న అనుభవంవల్ల తెలిసిన ముఖాలు కనిపిస్తాయేమోనని కొంచెం సేపు వెతికాను. పర్లేదు నాయనమ్మ చెప్పినట్లు నేను లేచిన వేళావిశేషం బాగున్నట్లుంది. రెండేళ్ల కిందట నాతో కలిసి పి.జి. చేసిన మా బ్యాచ్ మేట్స్ రజిత, భార్గవి కనిపించారు. చిన్నగా నవ్వి 'హాయ్' అంటూ చేయెత్తి పలకరించాను. రజిత గుర్తుపట్టినా భార్గవి గుర్తుపట్టినట్టులేదు. తెల్లముఖమేసుకుని చూస్తోంది. కారణం రజిత నాతోబాటే ఎమ్మే ఎకనామిక్స్ చేసింది. భార్గవి పాలిటిక్స్ స్టూడెంట్. రజితే నా గురించి ఫలానా అని చెప్పి గుర్తొచ్చేలా చేసింది.

దాంతో "ఏయ్, రాజూ.. నువ్వా?" అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది భార్గవి.

పి.జి. పూర్తయ్యాక ఇదే మళ్లీకలవడం. రెండేళ్లయింది. అందువల్ల "ఎలా ఉన్నావ్? ఎక్కడుంటున్నావ్? ఏం చేస్తున్నావ్?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారిద్దరూ... ముక్తసరిగా సమాధానమిచ్చి నేనెళ్లిన పని మొదలెట్టాను. "ముందుగా ఇప్పుడేం చేస్తున్నారు?" అనడిగాను.

దానికి రజిత ఎమ్.ఫిల్. ఇస్లామిక్ స్టడీస్ చేస్తున్నన్నానని బదులిచ్చింది.

"అదేంటీ... ఎకనామిక్స్‌చేసి 'ఇస్లామిక్ స్టడీస్' చేయడమేంటి?" అనడగాను.

"ఏదో ఒక కోర్స్ చేయకపోతే ఇక్కడుండలేం కదా?! ఇంటికెళితే పెళ్లి... పెళ్లి... అంటూ ప్రాణాలు తీస్తార"ంటూ మొదలెట్టి ఎన్నెన్నో విషయాలు చెప్పుకొచ్చింది రజిత. అసలే పెళ్లిళ్ల సీజనూ... వచ్చీపోయే చుట్టాలముందు అలంకరించుకుని కూర్చోమంటారు. ఇక ఆ వచ్చినవాళ్ళు ముక్కూముఖం వంకరగున్నాయంటూ ఏవో వంకలు పెడతారు. అటూ ఇటూ నడిచిచూపమనీ అంటారు. ఇంకేమైనా అంటారు... చివరికి 'కబురు పంపిస్తాం' అని చెప్పి బేరాలకు దిగుతారు. ఇంకొంతమందైతే అక్కడే సంతలో పశువుల్ని బేరమాడినట్టు ఎన్ని లక్షలిస్తారూ... అంటూ బేరాలు మొదలెడతారు. ఏదో లాంఛనప్రాయమైన చూపులయితే కొంతమేరకు ఫరవాలేదు. కానీ కొందరు పెళ్లికొడుకులుంటారు... అమ్మానాన్నల ముందే మాకు సైటుకొట్టబోతారు. బస్టాపుల్లో పోకిరి కుర్రాళ్లతో వేగలేక విసిగిపోయిన మాకు ఇలాంటి పరిస్థితికి తలకొట్టేసినట్టనిపిస్తుంది. అంతేకాదు తర్వాత జాతకాల పేరుచెప్పి మరికొంత రాద్ధాంతమూ చేస్తారు. "ఈమెను చేసుకుంటే మామ ప్రాణాలకు గండమని, స్థానభ్రంశమౌతుందని అర్థంపర్థంలేని కబుర్లు చెబుతారు. ఒకవేళ ప్రవర్తన బాగాలేదంటే తప్పువట్టినా అర్థముందిగానీ జ్యోతిష్యం పేరుతో మా ప్రమేయం లేకుండానే మమ్మల్ని నిందించడం ఎంతవరకు సమంజసం. అందుకే ఆత్మాభిమానమున్న వాళ్ళెవరూ అరేంజ్‌డ్ మ్యారేజ్ చేసుకోరనిపిస్తుంది...' అంటూ చిన్నచిన్న విరామాలతో సుదీర్ఘంగా మాట్లాడింది.

"అంటే... ప్రేమ వివాహాల్లో సమస్యలుండవా?" అని వెంటనే అడిగాను.

అందుకు బదులుగా "ఆ సంగతి నాకు తెలీదుగానీ మా కజిన్‌గురించి చెప్తా విను. పీజీ చేసినా అమ్మానాన్నల్ని కాదనలేక, వాళ్ళెక్కడ బాధ పడతారోనని అరేంజ్‌డ్ మ్యారేజ్‌కి ఒప్పుకుంది. పెళ్లికి ముందే ఆంక్షలూ... అధికారాలూ మొదలయ్యాయి. ఎలాగోలా సర్దుకుపోయింది. పెళ్లయిపోయింది. ఏం చేయాలన్నా ఆఖరికి స్నేహితురాలికి ఒక ఫోన్‌కాల్ చేసి మాట్లాడాలన్నా... వాళ్లనుమతి తీసుకోవాల్సిందే. ఇంత చదువు చదివినా స్వేచ్ఛ లేదు. పోనీ ఏదో ఉద్యోగం చేస్తే కొంత రిలీఫ్ దొరుకుతుందనుకుంటే ఆ అవకాశమూ ఇవ్వరే. అమ్మానాన్నల సంతోషంకోసం నేనీ నరకంలో ఎన్నాళ్లుండాలని రోజూ తలపట్టుకుంటోంది. ఇది కేవలం మా కజిన్‌దే కాదు చాలావరకు అరేంజ్‌డ్ పెళ్ళిళ్ళ పరిస్థితి ఇలాగే వుంది" అంటూ తనకు తెలిసిన కొన్ని ఉదాహరణలిచ్చింది రజిత.

రజిత అభిప్రాయంతో అందరూ ఏకీభవించలేరు. ప్రేమపెళ్ళిళ్ళు మంచివా, పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు మంచివా అని తేల్చిచెప్పడం కష్టం. ఇప్పటికి ఇక్కడో కామాపెట్టి ఈసారి ఇంకొందరి అభిప్రాయాలను తెలుసుకుందాం... సరేనా...

సినిమా కబుర్లు

ముదిగొండ సాంబశివరావు

సీనియర్ నటి **టి.కనకం**

చెప్తోన్న కబుర్లు...

ఎంత ప్రయత్నించినా కథానాయిక కాలేకపోయాను...

అప్పుడు భలే స్టయిల్‌గా ఉండేదాన్ని. ఫుల్ హ్యాండ్స్ బ్లౌజు, కర్లీ హెయిరు, లైట్‌శారీ ఇలా ఒరిస్సా గెటప్‌లో ఉండేదాన్ని. బి.ఎన్. రెడ్డిగారి ద్వారా ఎల్.వి. ప్రసాద్‌గారికి పరిచయం జరిగింది. ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వం వహిస్తోన్న గృహప్రవేశంలో (1946) బాల వితంతు వేషం వేశాను. ఆ చిత్రంలో రెండుపాత్రలు వేశాను. పి.భానుమతిగారితో కలిసి 'మేలుకో' అన్నపాటలో గ్రూప్ డాన్స్ చేశాను.

ఆ సమయంలోనే మీర్జాపురం రాజా వారు శోభనాచల స్టూడియోస్ బేనర్‌పై 'కీలుగుర్రం' తీస్తున్నారు. కొత్తవారి ఎంపిక జరుగుతోంది. మీర్జాపురం రాజావారి దివాణంలో కొండయ్య అని ఒకాయన ఉండేవారు. రేడియోస్టేషన్‌లో పరిచయాన్ని పురస్కరించుకొని 'కీలుగుర్రం'లో వేషం ఇప్పించారు. 'కీలుగుర్రం'లో కీలక పాత్రధారిణి అంజలీదేవి చెలికత్తె 'కేకిని' వేషం ఇచ్చారు. రేలంగి జంట. చాలా టిపికల్ రోల్. అంజలీదేవి, నేనూ ఇద్దరం రాక్షసస్త్రీలం. ఏనుగులు, గుర్రాలను చంపి పీక్కుతినే రాక్షసస్త్రీలు కామరూపం కూడా ధరించగలరు. అందగత్తెలా మారిపోతుంటారు. రాజు (ఎం.వి.సుబ్బారావు)ను వశపర్చుకుని ఆ రాజ్యంలో ప్రవేశించాం. అక్కడినుంచి మా ఆట ప్రారంభమవుతుంది. అయితే వాస్తవంగా రాక్షసరూపంలో నటించింది మాత్రం మేము కాదు. సికింద్రాబాద్ సరోజిని, విశాలాక్ష్మి.

కీలుగుర్రం బాక్సాఫీసు బద్దలుకొట్టింది. ఆ కేకిని వేషానికి మొదట అనుకుంది లక్ష్మీరాజ్యాన్ని. చివరకు నేను చేశాను. మొదటి నుండి నాకు ప్లేబాక్ లేదు. నా పాటలు నేనే పాడుకునేదాన్ని. శోభనాచల స్టూడియోలో మాకు నెల జీతాలుండేవి. కీలుగుర్రం విజయోత్సవ వేడుకల్లో అక్కినేని నాగేశ్వరరావు గారికి బంగారుగుర్రం, అంజలీదేవికి బంగారువీణ, నాకు పదికాసుల బంగారం కానుకగా ఇచ్చారు. కీలుగుర్రంతో అంజలీదేవికీ నాకూ ఇక ఇలాంటి వేషాలే వస్తాయని భయపడ్డాం. వెంటనే 'శ్రీ లక్ష్మమ్మకథ'తో అంజలీదేవి హీరోయిన్ అయింది. నేను కథానాయికను అవుదామని ఎంత ప్రయత్నించినా కాలేకపోయాను.

వాహినీవారి 'గుణసుందరికథ'లో మకరకన్య వేషం వచ్చింది. ఆ చిత్రానికి కె.వి.రెడ్డిగారు దర్శకులు. మకరరాశి ప్రవేశంలో ఆ పాత్ర సెక్సీగా కనిపించాలి. ఆ రోజులకు అదే పెద్ద సెక్సీ వేషం. పత్రికలన్నీ మకరకన్య వేషం గురించి అసహ్యంగా రాశాయి. దాంతో నాకు సెక్స్ స్టార్ పేరొచ్చింది. వేషాలు తగ్గాయి. సెక్సీ పాత్రలు, వాంప్ వేషాలే రావటం మొదలయింది.

కె.వి.రెడ్డిగారే తన సొంత చిత్రం 'భాగ్య చక్రం'లో రాజనాల పక్కన మంచి వేషం ఇచ్చారు. తర్వాత 1949లో 'రక్షరేఖ' మొదలైంది. కస్తూరి శివరావు పక్కన. అదీ సెక్సీ వేషమే. అయినా తప్పదు ఒప్పుకున్నాను. అప్పటి నుండి మా జంట బాగా పాపులర్ అయింది. శివరావు తర్వాత సీతారాం, నల్ల రామమూర్తిగార్ల జంటగా పేరొచ్చింది. 1952లో వచ్చిన 'టింగు రంగా'లో మేం ముగ్గురం కలిసి నటించాం. దాన్నే తర్వాత 'శ్యామల' పేరుతో తమిళంలో నిర్మించారు. మా జంట అందులోనూ నటించింది. సౌదామిని, సతీ సక్కుబాయి చిత్రాల్లో రేలంగితో చేశాను.

హీరోయిన్ అవకాశాలు పోయాయి. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాల్సిన పరిస్థితి. దీంతో సెక్సీ స్టార్ నుండి నెమ్మదిగా కామెడీ నటిగా పేరు తెచ్చుకున్నాను. 'సౌదామిని' చిత్రం సమయంలో ఆరుద్రగారు, ఆయనద్వారా శ్రీశ్రీగారు పరిచయమయ్యారు. వీరిద్దరే ఇండస్ట్రీలో నాకు అత్యంత ఆప్తులు, స్నేహితులు. నాకు సంబంధించిన అంశాల్లో మంచిచెడులను బేరీజు వేసి మార్గదర్శకత్వం చేశారు. ఆరుద్రను అన్నయ్య అని పిలిచేదాన్ని. నేను పాడే జానపద గేయాలంటే ఆయనకెంతో ఇష్టం. సెట్‌లో ఏమాత్రం తీరిక దొరికినా నాచేత పాడించుకొని విని నోట్‌బుక్‌లో రాసుకునేవారు. నేను పీటర్స్ రోడ్డులో ముదిగొండ లింగమూర్తిగారింటి ఎదురుగా పెద్ద మేడలో ఉండేదాన్ని. మా ఇంట్లోనే కూర్చుని ఆరుద్రగారు స్క్రిప్టు వర్కు చేసుకునేవారు.

మిద్దెలు, మేడలు సంపాదించాను. రెండు కార్లు కొన్నాను. ఎలాంటి బాదర బందీలు లేవు. కారులో నేరుగా మౌంట్‌రోడ్డువరకూ వెళ్లి పిస్తా పప్పు, తినుబండారాలు కొనుక్కొచ్చి కంపెనీలో అందరికీ పంచేదాన్ని. పెంకిపిల్ల, రణపెంకి అని అందరూ అనుకునేవారు. బయట ఎంత అల్లరిచేసినా షూటింగ్‌లో మాత్రం అంకితభావంతో పనిచేసేదాన్ని. పాత్ర ఎంత సహజంగా ఉండాలో అంత సహజంగా చేయటానికి ప్రయత్నించేదాన్ని. అది నా నైజం.

తెలుగులో మొట్టమొదటి డబ్బింగ్ చిత్రం 'ఆహుతి'. వాసిరెడ్డి నారాయణరావుగారు చేశారు. శ్రీశ్రీగారు ఆ చిత్రానికి రచయిత. అంతకుముందే పరిచయం ఉండటంవల్ల నా చేత ఓ పాత్రకు డబ్బింగ్ చెప్పించారు. ఒకచోట 'నువ్వు చెప్పింది బాగోలేదు' అని శ్రీశ్రీగారు మందలించారు. నాకు ఏడుపొచ్చింది. మళ్లీ మళ్లీ చేయించారు. 'కనకం అంటే బంగారమే కాదు హృదయం కూడా" అని శ్రీశ్రీగారు ఇచ్చిన మెచ్చుకోలు ఇప్పటికీ గుర్తొస్తుంటుంది.

మాయపిల్ల, తిలోత్తమ, ఆకాశరాజు, అగ్నిపరీక్ష, చంద్రవంక, సాహసం తదితర చిత్రాల్లో నటించాను. రఘురామయ్య నటించిన 'దాసి' సినిమాలో ఎన్టీ రామారావు రెండోభార్యగా గయ్యాళిపాత్రలో నటించాను. మనూస్ అని ఆ రోజుల్లో ఓ నిర్మాత ఉండేవారు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చుచేసేవారు. ఆయన తీసిన 'ప్రపంచం' చిత్రానికి నల్ల రామ్మూర్తితో కలిసి రెండురోజులే నటించాను. దానికి ఆయన 12 వేల రూపాయలు ఇచ్చారు. నా జీవితంలో తీసుకున్న ఎక్కువ పారితోషికం అదే.

ఇంకా వుంది...

ఎవరు ముందు?

హేయ్ చిన్నారులూ... ఏంటి ఇక్కడ మేం పిలుస్తుంటే అక్కడ ఎక్కడో చూస్తున్నారేంటి? మేమర్రా! కుందేళ్లం. కింద బొమ్మలో వున్నాంకదా. హమ్మయ్య. ఇప్పటికైనా చూసినందుకు సంతోషం. సరేగాని, మేం ఇద్దరం పోటీ పెట్టుకున్నాం. ఈ గజిబిజి దారులు దాటుకుంటూ ఎవరైతే ముందుగా మా డైనింగ్ టేబుల్ దగ్గరకు చేరుకుంటారో వారు గెలుపొందినట్టు. మా బదులు మీరు దగ్గర దారి కనిపెడతారా! ०

ఆ ఆరు తేడాలేంటబ్బా!



హాల్లో బుజ్జాయిలూ... పైన రెండు బొమ్మలున్నాయి. అవి రెండూ చూడ్డానికి ఒకేలా వున్నా... ఆరు తేడాలున్నాయి. మీరే వాటిని కనిపెట్టాల్సి వుంది. బాగా పరిశీలనగా చూస్తేనే మీరు ఆ తేడాలను గుర్తించగలుగుతారు. లేకుంటే ఇంతేసంగతులు. సరే మీరు వాటన్నిటినీ పసిగట్టేశాక మా జవాబులు చూడండి.

జవాబులు: 1. కుక్క చెవి, 2. కుక్క తోక, 3. కుక్క కాలు 4. బాబు బూటు 5. వీపు మీది చొక్కా కింది భాగం 6. పిల్లవాడు కుక్కపిల్లమీద చెయ్యి వేశాడుకదా. ఆ చేతి చొక్కా. ०

ఏది ఎక్కడుందో!

నేస్తాలూ... పక్కన ఒక చక్కటి బొమ్మ వుంది. ఆ బొమ్మలోనే పైన పేర్కొన్న కొన్ని వస్తువులు, ప్రాణులు వున్నాయి. మీరు జాగ్రత్తగా పరిశీలించి వాటిని కనిపెట్టాలి.

చిన్నారి చిత్రకారులు

పైడి నరేష్,
సెయింట్ ఆన్స్ స్కూల్,
రాజాం, శ్రీకాకుళం.



మాగి కళ్యాణి,
7వ తరగతి,
ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఎస్, మధిర.

బాలనేస్తాలు

కవల బాతులేవో!



రంగులు అద్దేద్దాం

అట్టమీది కథ

ప్రవీణ్‌కుమార్. ఆర్



బుధియా

వివాదంలోకి పరుగు..

భువనేశ్వర్ మురికివాడనుంచి వచ్చిన బక్కపలుచని నాలుగేళ్ల పిల్లాడు తన పసి పాదాలకు పనిచెప్పాడు. సంచలనాలకు తెరలేపాడు. పూరీ నుంచి భువనేశ్వర్ వరకూ ఏకబిగిన పరుగెత్తడం ద్వారా రికార్డుల్లోకే కాదు.. వివాదాల్లోకీ పరుగుతీశాడు. ఆకలి అనగానే మనకు ఎన్నెన్నో గుర్తుకొస్తాయి. బుధియాకు మాత్రం ఆకలంటే పరుగు. ఆకలేస్తే పరుగు. 65 కిలోమీటర్ల దూరాన్ని ఏడుగంటల్లో పరిగెత్తడం వెనక ఎంత ఒత్తిడి ఉంది? ఎవరి ప్రయోజనం దాగుంది? మానవహక్కుల సంఘం నోటీసులిచ్చినా, ఒరిస్సా ప్రభుత్వం అరెస్టు చేస్తామని హెచ్చరించినా కోచ్ మాత్రం పరుగు ఆగనివ్వనంటున్నాడు. చిన్నారి ఆరోగ్యానికే ప్రమాదమని వైద్యులు చెబుతుంటే, వాటికి ఆధారాల్లేవని కొట్టేస్తున్నాడు. ఇదేంటని క్రీడాప్రముఖులు ప్రశ్నిస్తే.. చూడలేకపోతున్నారని అంటున్నాడు.

1976లో ఉత్తర అస్సాం రాష్ట్రంలోని ఓ మారుమూల గ్రామంలో పదేళ్ల కుర్ర మావటిని చూశాడు బ్రిటిష్ ఫొటోగ్రాఫర్ డేనియల్ రోమిక్. ఆ సతత హరితారణ్యంలో మత్తగజాన్ని అదుపులోకి తెస్తూ, వేణువు వాయిస్తున్న పాలబుగ్గల పిల్లాడు 'మన్షూ'ని చూడగానే మహదానంద భరితుడయ్యాడు డేనియల్. వెంటనే మన్షూ తల్లిదండ్రులకు వందరూపాయలిచ్చి అతన్ని అమెరికా తీసుకెళ్లడం, ఓ బ్రహ్మాండమైన హాలీవుడ్ సినిమా 'ఎలిఫెంటా బాయ్' తీసేయడం చకాచకా జరిగిపోయాయి. అది హాలీవుడ్ చరిత్రలోనే ప్రముఖ బాలల చిత్రంగా కలెక్షన్ల వర్షం కురిపించింది. డేనియల్ శతకోటీశ్వరుడయ్యాడు. సన్మానాలూ పొందాడు. వాస్తవిక చిత్రణతో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసిన ఆ బాలుడు మాత్రం ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ ఉత్తర అస్సాంలోని తమ గూడెంలో ఏనుగులు కాసుకుంటూ తిరగడం ప్రారంభించాడు. ఇప్పుడాయనకు 30 ఏళ్లు. చిరిగిన దుస్తులేసుకుని తరాలనాటి వేణువు వాయించుకుంటూ తమకున్న రెండు గేదెలు, ఆవులు మేపుకుంటూ కనబడతాడు.

మన్షూలాగే... సరిగ్గా 20ఏళ్ల తర్వాత దాదాపు అదే తరహాలో తెరమీదకు వచ్చాడు బుధియా. అయితే ఇతను 'మారథాన్ బాయ్'. వెలుగులోకి తీసుకొచ్చింది జూడో టీచరు బైరంచీదాస్. నాలుగేళ్ల వయసులోనే 40 మైళ్లు పరుగెత్తిన బుధియా లిమ్కా రికార్డును సొంతంచేసుకున్నాడు. అయితే ఇప్పుడిప్పుడే ప్రారంభమైన బుధియా సంచలనాత్మక పరుగు వివాదాల్లోకి దారితీసింది.

ఎవరీ బుధియా..?

ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లోని ఓ మురికివాడలో పుట్టాడు బుధియాసింగ్. తల్లి సుకంతిసింగ్‌కి మూడో సంతానం. అయితే బుధియాకి రెండేళ్ల వయసున్నప్పుడు దినసరి కూలీగా పనిచేసే అతని తండ్రి చనిపోయాడు. దీంతో సుకంతి కొడుకు బుధియాను అమ్మకానికి పెట్టింది. పేదరికం కారణంగా బిడ్డల అమ్మకాలు ఒరిస్సాలో కొత్తకావు. భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు కాన్వెంట్ స్కూల్లో జూడో టీచర్‌గా పనిచేస్తున్న బైరంచీదాస్ బుధియాను 800రూపాయలకు కొనుగోలుచేశాడు. అయితే అతనికి జూడోలో కన్నా పరుగుల్లో మంచి ప్రతిభ ఉందని గుర్తించాడు. బుధియా 40మైళ్లు సులువుగా పరిగెత్తగలడంటూ రెండేళ్ల క్రితం ఓ ప్రచారాన్ని ప్రారంభించాడు. తొలుత భువనేశ్వర్‌లోనే చిన్నచిన్న ప్రదర్శనలిప్పించాడు (అప్పుడతని వయసు రెండేళ్లే). 'విరామం లేకుండా 70 గంటలు పరుగెత్తగల బాలుడు' శీర్షికన బిబిసి గత సంవత్సరం బుధియాపై ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. లోకల్ సిఆర్‌పిఎఫ్ అధికారులు, ఇతర ఎన్జీవోల సహాయం తీసుకుని పూర్తిగా బుధియా శిక్షణలోనే మునిగారు కోచ్ బైరంచీదాస్. ఆ చిన్నారితో ఏకధాటిగా 90 కిలోమీటర్లు పరుగెత్తించాలన్నదే ఆయన లక్ష్యం.

కఠిన శిక్ష(ణ)..!

పిన్న వయసులోనే బుధియాకు డైట్ ప్రారంభించాడు. తెల్లవారుజామున 5గంటలకే నిద్రలేపేవాడు. 10 నుంచి 12 కిలోమీటర్ల పరుగు, తర్వాత రెండు అరటిపళ్లు ఇచ్చి భువనేశ్వర్‌లోని సిఆర్‌పిఎఫ్ స్టేడియంలో వంద చక్కర్లు కొట్టించేవాడు. ఆ తర్వాత గ్లాసు పాలు తాగించి కొద్దిగా విశ్రాంతినిచ్చేవాడు. తిరిగి శారీరక దారుఢ్య శిక్షణ, వ్యాయామం, జూడో ప్రాక్టీసు నడిచేది. ఇవన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం 12 గంటలయ్యేది. అంతటితో ఉదయంపూట శిక్షణ పూర్తయ్యేది. తిరిగి సాయంత్రం మూడు గంటలకు 12 కిలోమీటర్ల పరుగుతో మళ్లీ రెండోవిడత శిక్షణ మొదలయ్యేది. పాలు తాగించి, తిరిగి వ్యాయామం చేయించేవాడు. క్రమంగా దూరం పెంచుతూ బుధియాతో పరుగులు పెట్టించాడు. ఎక్కడా ఆగకుండా 65కిలోమీటర్ల దూరం (40 మైళ్లు)

బుధియా పరిగెత్తగలడని ప్రకటన చేశాడు.

ఆ రోజు..

పక్షం రోజులక్రితం 65 కిలోమీటర్ల దూరాన్ని 7.02 గంటల్లో పరుగెత్తి (పరుగెత్తించబడి) రికార్డులు సృష్టించాడు బుధియా. ఈ నెల రెండో తేదీన పూరీ జగన్నాథ ఆలయంనుంచి భువనేశ్వర్‌లోని సిఆర్‌పిఎఫ్ స్టేడియంవరకూ తారురోడ్డుపై ఈ పరుగు సాగింది. తెల్లవారుజామున 4గంటలకు ప్రారంభమైన ఈ మారథాన్‌కు సిఆర్‌పిఎఫ్ స్పాన్సర్‌గా నిలిచింది. అతని వెంట 300మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. సైకిళ్లపై, నడుచుకుంటూ ఇలా అతని వెంట పరుగు పెట్టినట్లుగా కాకుండా, వెంటబడి తరుముతున్నట్లుగా జరిగిందీ తతంగమంతా. మొత్తం 70 కిలోమీటర్లు పరిగెత్తాల్సి ఉండగా, 65 కిలోమీటర్ల తర్వాత అతనికి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీన్ని గమనించిన వైద్యులు రన్ ఆపాలని, లేకపోతే అతని ప్రాణాలకే ప్రమాదమని తెలుపడంతో అంతటితో ఆ కార్యక్రమాన్ని ముగించారు. అతన్ని సిఆర్‌పిఎఫ్ వాహనంలో నగరంలోకి తీసుకెళ్లగానే స్థానిక అధికారులు పూలదండలతో స్వాగతం పలికారు. '65 కిలోమీటర్ల దూరాన్ని 7.02 గంటల్లో బుధియాసింగ్ విజయవంతంగా పూర్తిచేశాడు. దీన్ని రికార్డుగా గుర్తిస్తున్నాం. 2007 ముద్రణలో అతని పేరునూ చేర్చుతాం' అని లిమ్కాబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అసిస్టెంట్ ఎడిటర్ అమీన్ టూర్ చెప్పారు. కోచ్ బైరంచీ మాత్రం 'బుధియా ఈ దూరాన్ని చాలాసార్లు పూర్తిచేశాడు. అయితే తగిన రికార్డులు లేకపోవడంతో దాన్ని నిరూపించుకోలేకపోయాం. ఇప్పుడది సాధ్యమైంది' అని చెప్పారు.

వివాదాల సుడి

ఇంకా పక్కటెముకలు కూడా సరిగా నిలదొక్కుకోని వయసులో బుధియాను ఈ సాహసంలోకి దింపడంపై వివాదాలు ముసురుకున్నాయి. వైద్యులు, ఇతర ప్రముఖుల దగ్గరనుంచేకాక, ఆ రంగంలోని ప్రముఖులు కూడా బుధియా పరుగును ఆపాలని, కోచ్‌పై చర్యతీసుకోవాలని డిమాండ్ చేయడంతో దేశవ్యాప్తంగా చర్చోపచర్చలు ప్రారంభమయ్యాయి. తన స్వలాభం కోసమే కోచ్ బైరంచీదాస్ బుడతడి జీవితాన్ని నాశనం చేస్తున్నారని గతవారం బుధియాకు పరీక్షలు నిర్వహించిన వైద్యుల బృందం కూడా విమర్శించింది. ఇదేవిధంగా పరిగెత్తిస్తే అతడు చిన్నవయసులోనే కీళ్లనొప్పులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడటమే కాకుండా అతడి శారీరక ఎదుగుదల నిలిచిపోయే ప్రమాదముందని ప్రత్యేక వైద్యబృందం ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన 13 పేజీల తాత్కాలిక నివేదికలో పేర్కొంది. మరాథాన్‌లో బుధియా మరోమారు పాల్గొనకుండా చూడాలని కోరగా, బుధియాను బైరంచీ చెరనుంచి విడిపించాలని పయోలీ ఎక్స్‌ప్రెస్ పి.టి. ఉష ఒరిస్సా ప్రభుత్వాన్ని కోరింది. అంతేకాదు, కోచ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఆ రాష్ట్ర శిశుసంక్షేమశాఖ విచారణ కమిటీ డిమాండ్ చేసింది. ఇప్పటికీ వివాదాల సడి సద్దుమణగలేదు. తాను రెండోసారి పరుగెత్తడానికీ సిద్ధమని బుధియాతో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మరీ చెప్పించడంతో రెండోసారి అన్నేసి కిలోమీటర్ల చొప్పున పరుగెత్తిస్తే కోచ్‌ను అరెస్టుచేస్తామని ఒరిస్సా ప్రభుత్వం హెచ్చరించింది. దీన్ని క్రూరమైన చర్యగా భావించాల్సి వస్తుందని, శిశుసంక్షేమ చట్టం-2000 (సెక్షన్ 23), భారత శిక్షాస్మృతి 336 కింద బైరంచీదాస్‌ను అరెస్టు చేయవచ్చని ప్రకటించింది. మరోవైపు బుధియాపై బలవంతంగా వైద్యపరీక్షలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తాను హైకోర్టును ఆశ్రయిస్తానని కోచ్ బైరంచీ చెబుతున్నాడు. 'వారు చేసిన పరీక్షలు అర్థం లేనివి. వాటికి ఏం ఆధారాలున్నాయో తెలీదు. అలాంటప్పుడు ఎలా నమ్ముతాం' అని వాదిస్తున్నాడు.

పసిపాదాలకు పరుగులా..?

పసిబిడ్డ పొట్టపై కత్తిగాటేసి రక్తం కారుతుంటే భుజానేసుకుని అడుక్కునేవాళ్లు తిరునాళ్లలో, బస్‌స్టాండ్‌లో కనిపిస్తే మనసున్నవాడికి మెలిపెట్టినట్లవుతుంది. మరి నాలుగేళ్ల పిల్లాడు నాలుక పిడచగట్టుకుపోతుంటే, మే మాసపు నడి మధ్యాహ్నపు ఎండలో ఒళ్లంతా చెమటతో తడిచిపోయి, కిందికి జారుతున్న నిక్కరును పైకి లాక్కుంటూ, భారంగా శ్వాస తీసుకుంటూ, శక్తి సన్నగిల్లి నడవలేక నడవలేక పరుగెత్తుతుంటే 300మంది వెనక చేరి చప్పట్లు చరుస్తూ తరుముతున్నట్లు నడుస్తుంటే దాన్ని 'మారథాన్ మ్యాజిక్'గా వర్ణించాలా? సర్కస్‌లో చేయించినట్లు ప్రపంచ రికార్డుకోసం చిన్నారితో ఫీట్లు చేయించవచ్చా? 'బుధియా ఏనాటికైనా గిన్నిస్ రికార్డులకెక్కుతాడు. అతి పిన్న వయసు స్ప్రింటర్‌గా ప్రపంచరికార్డే ఆతని లక్ష్యం' అని కోచ్ చెబుతున్నారు. నాలుగేళ్ల బుధియానే ఆ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడా? లేక కోచ్ బైరంచీ తనకోసం పెట్టుకున్న లక్ష్యమా? అన్న ఒక్క ప్రశ్నపైనే మొత్తం వ్యవహారమంతా దాగుంది. 'పిల్లలకు అలాంటి అవకాశమే లేదు. పెద్దవాళ్ళే తమ లక్ష్యాన్ని నిర్దిష్టంగా నిర్ణయించుకోలేరు. అలాంటిది మూడేళ్ల పిల్లాడు ఎవరి ప్రమేయం లేకుండా లక్ష్యం నిర్ణయించుకున్నాడనడం శాస్త్రీయంగా అసాధ్యం' అని ప్రొఫెషనల్ కౌన్సిలింగ్ సర్వీసెస్ సలహాదారు సరస్వతీ భాస్కర్ అంటున్నారు. ఈ సాహసం బుధియాకు ఆనందం కలిగిస్తున్నదనుకున్నప్పటికీ.. అతడి శారీరక పెరుగుదలపై ప్రభావం చూపుతుంది. పిల్లల్లో ఏడేళ్ల తర్వాతే కన్ను- చేతుల మధ్య సమన్వయం ఏర్పడుతుంది. పిల్లలకు పుష్కలంగా కావాల్సిన విశ్రాంతి, నిద్ర అతడికి లభిస్తోందో, లేదో తెలీదు. 'సాహసం చేయరా బుధియా' అంటూ భయపెడ్తే లేదా బలవంతంచేస్తే మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. దాని ప్రభావం శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్రంగా ఉంటుంది. బుధియాకు అన్ని విభాగాల్లోనూ సమానమైన అభివృద్ధి అవసరమని ఎస్‌ఐపి అకాడమీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ దినేష్ విక్టర్ అన్నారు. 'శరీరంలోని అన్ని విభాగాల్లోనూ అభివృద్ధి సమానంగా ఉంటేనే బుధియా ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క. మాకు అందిన సమాచారం మేరకు అతని శరీరంలో పరిగెత్తగలిగే సామర్థ్యమొక్కటే అవసరానికి మించి అభివృద్ధి చెందుతోందే తప్ప, అతడి సామాజిక, శారీరక సామర్థ్యం పెరగడం లేదు' అని చెప్పారు.

పరిపూర్ణ ఎదుగుదల లోపాన్ని నివారించేందుకు ప్రొఫెషనల్ టెన్నిస్‌లో ప్రవేశానికి కనీస వయసును నిర్ణయించారు. 11ఏళ్ల వయసుకు ముందు ఏ మారథాన్ రన్నరూ ప్రాక్టీసు ప్రారంభించలేదు. అలాంటి నష్టాలకు బుధియా ఎంతమాత్రం అతీతుడు కాదన్నది వైద్యులు చెబుతున్న వాస్తవం. మరోవైపు మీడియా కూడా ఆ చిన్నారిని ఓ 'సూపర్‌కిడ్'లా ప్రచారం చేస్తుండటంవల్ల ఇతర పిల్లలకు నష్టం కలిగే ప్రమాదముంది. 'శక్తిమాన్' సీరియల్ చూసి నిజజీవితంలో కాళ్లూచేతులు విరగ్గొట్టుకున్న పిల్లల సంఖ్య తక్కువేం లేదు. మరోవైపు పిల్లలతో ఇలాంటి పిచ్చిపనులు చేయించే





తల్లిదండ్రులూ ఉన్నారు. పిల్లల్ని సచిన్‌లానో, సానియాలానో చూసుకోవాలనుకుని అడుగున్నర కూడా హైటు లేనివాడికి హార్లిక్స్ తాగించి బ్యాటూ, టెన్నిస్ రాకెటూ ఇచ్చి ప్రాక్టీసుకు పంపించే వాతావరణం దేశమంతటా ఉన్నదే. అయితే బుధియా ప్రభావంతో ఆ తర్ఫీదు మరీ నాలుగేళ్లనుంచే మొదలయ్యే దిశగా ప్రయత్నిస్తే నష్టం అంచనాలకు అందనిది. అప్పుడిక దాన్ని పూడ్చుకోవడం ఎవరి తరమూ కాదు.

ఎవరి ప్రయోజనం దాగుంది?

బుధియా పరుగుకు గిన్నిస్ హోదా సాధించి ప్రపంచ దృష్టిని ఆకర్షించాలన్నది బైరంచీదాస్ ఎత్తుగడ. ఇందుకోసమే అతని పేదరికాన్ని ఆసరా చేసుకుని బుధియాను బలిపశువును చేస్తున్నాడన్నది ప్రధాన విమర్శ. బుడతడిని ఏకబిగిన 90 కిలోమీటర్లు పరిగెత్తించాలని ప్రణాళిక రూపొందించాడు. అందుకోసం కఠినాతికఠినమైన శిక్షణలోకి దింపాడు. తగిన శక్తి అందించడానికి గుడ్లు, పాలు, సోయాబీన్, మాంసంతో కూడిన పౌష్టికాహారం అందించాడు. అయితే ఒకవేళ బుధియా శారీరక అభివృద్ధిక్రమం దెబ్బతింటే అందుకు కోచ్ బాధ్యత వహిస్తాడా? భవిష్యత్తులో ఆ పిల్లాడు పరుగును కొనసాగించలేకపోతే అతని భవిష్యత్తేంటి? గార్డియన్‌గా ఉన్న కోచ్ భరిస్తాడా? లేక మన్నూలాగే భువనేశ్వర్ రోడ్లపైన వదిలేస్తాడా? పూరీ-భువనేశ్వర్ రన్ తర్వాత ప్రపంచ దృష్టిలో పడ్డ బుధియా ఇటీవల ఓ మ్యూజిక్ ఆల్బమ్‌లోనూ నటించాడు. 'బుధియా-రే- బుధియా' అనే పేరుతో విడుదలవుతున్న ఈ ఆల్బమ్ రెమ్యునరేషన్ కింద బైరంచీదాస్ లక్షలు వెనకేసుకున్నాడన్నది ఆయనపై తాజా ఆరోపణ.

ప్రచారం, సెలబ్రిటీ ఎక్కడుంటే అక్కడ అందరికన్నా ముందు బహుళజాతి సంస్థలు వాలుతాయన్నది జగమెరిగిన సత్యం. బుధియా విషయంలోనూ మల్టీనేషనల్ కంపెనీలు ఇప్పుడు స్పాన్సర్‌షిప్ కోసం అర్రులు చాస్తున్నాయి. విఖ్యాత స్ప్రింట్ షూ కంపెనీ 'నైక్' ఇప్పటికే బైరంచీతో ఒప్పందం చేసుకుంది. బుధియా శిక్షణకు అవసరమయ్యే పూర్తి ఖర్చును భరించడంతోపాటు నెలవారీ రెమ్యునరేషన్ అందిస్తానని, అయితే తమ ఉత్పత్తులకు ఆ పిల్లాడితో ప్రచారం చేయించాలని 'నైక్' కోరడంతో బైరంచీ ఓకే చెప్పాడన్నది తాజా కబురు. మే2నాటి మారథాన్ రన్‌కు ముందే ఒప్పందం కుదిరింది. ఆ కార్యక్రమంకోసం నైక్ ప్రత్యేక షూలు కూడా తయారుచేసిచ్చింది. రేపోఎల్లుండో శీతలపానీయ కంపెనీలు కూడా 'మారథాన్ బోయ్'తో ఆటలాడుకుంటాయనడంలో ఆశ్చర్యాలూ, అనుమానాలూ అవసరం లేదు.

*

కోచ్ చెర నుంచి తప్పించండి...

పి.టి. ఉష

బుధియాను కోచ్ చెర నుంచి తప్పించండి. నాలుగేళ్ల బుడతడు మారథాన్‌లో పాల్గొనడం నన్ను ఆశ్చర్య పరిచింది. పెద్దవాళ్లకే సాధ్యంకాని 65 కిలోమీటర్ల దూరం ఆ చిన్నారితో పరుగెత్తించేందుకు ఎవరు అనమతి నిచ్చారు? కేవలం పేరు ప్రఖ్యాతుల కోసం చిన్నారితో అలా పరుగెత్తించడం న్యాయమా? నేను అకాడమీలో 12ఏళ్లు పైబడిన వారికే శిక్షణనిస్తున్నాను. వీరు సరైన ట్రాక్‌లోకి రావడానికి ఇంకా మూడు, నాలుగేళ్లు పడుతుంది. అలాంటిది ఈ వయసులో మూడోవంతు కూడా లేని పిల్లాడితో ఇలా పరుగులు పెట్టించడం చాలా క్రూరం. బుధియాలో ప్రతిభ ఉంటే దాన్ని భవిష్యత్తులో ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి. అదీ క్వాలిఫైడ్ అథ్లెటిక్ కోచ్‌తో శిక్షణనిప్పించాలి. అంతేకానీ మోయలేని భారం మోపడం అన్యాయం.

నేనేం నేరం చేయలేదు...

బైరంచీదాస్

నేనేం నేరం చేశాను? బుధియా రికార్డులు సాధిస్తే నాకేమైనా వస్తుందా? ఒరిస్సా ప్రభుత్వమూ, మానవ హక్కుల సంఘాలు వారివారి ప్రయోజనాలు చూసుకుంటున్నాయి. మారథాన్ రన్‌తో బుధియా ఆరోగ్యం దెబ్బతింటుందని డాక్టర్లు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. కానీ మే2నాటి పరుగు తర్వాత కూడా అతను అంతే ఉత్సాహంగా ఉన్నాడు. ఈరోజు ఉదయం కూడా 12 కిలోమీటర్లు పరిగెత్తాడు. ఎవరో చెబితే నేను నా లక్ష్యాన్ని వదిలేసుకుంటానా? పిల్లాడికి లేని ఇబ్బంది మిగతావాళ్లందరికీ ఎందుకు? బుధియాను బలవంతంగా ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు చేశారు. అది నేరం. ఈ విషయంలో నేను హైకోర్టుకి వెళ్తాను.



చిరంజీవి కల్పన

వేదగిరి రాంబాబు

చాలామంది అనేక సందర్భాల్లో 'చిరంజీవ... చిరంజీవ' అని దీవిస్తుంటారు. అంతమాత్రాన అందరూ చిరంజీవులైపోతున్నారా? కాదుగానీ కొందరు చిరంజీవులు గానే ఉంటున్నారు. ఆశ్చర్యపోతున్నారా? గతవారం అలాంటి చిరంజీవి నారాయణన్ గురించి చదువుకున్నాం, మర్చిపోయారా? అలాగే ఇంకొందరు చిరంజీవుల గురించి తెలుసుకుందాం.

ఈ ఫొటోలో ఉన్న చిన్నారిని చూడండి. ముఖంలో ఎంత అమాయకత్వం! పసితనం ఇంకా ముఖాన్ని విడిచిపెట్టి పోలేదు. పేరు ఆర్. కల్పన. వయసు పదేళ్లు. పుట్టిపెరిగింది హైదరాబాద్‌లోనే.

ఇంకా పూర్తిగా అవయవాలే వృద్ధిచెందని ఈ పాప కొందరు పెద్దలకు ప్రాణం పోసిందంటే ఆశ్చర్యంగాలేదూ?! ఈ మాట విన్న తరువాత ఆ పాప ముఖంలో దైవత్వం కనిపించడం లేదూ...?

మనకి జన్మనిచ్చేవారినీ, మన అభివృద్ధి కోరేవారినీ అత్యంత ఆప్తులనుకుంటాం. మరి తన అవయవాలను దానంచేసి మరికొందరికి ప్రాణం పోసిన ఈ పాపను ఏమనాలి? ఆమెకి ఎన్ని విశేషణాలైనా సరిపోవు. ఎంతగా ప్రశంసించినా తక్కువేగానీ ఎక్కువమాత్రం కాదు.

కళ్లముందు ఆడుతూ... పాడుతూ... తిరగాల్సిన ఈ పాప హఠాత్తుగా యాక్సిడెంటు జరిగి బ్రెయిన్‌డెత్‌కు గురైంది. తల్లిదండ్రులు, తోబుట్టువులు తల్లడిల్లిపోయారు.

మంచివాళ్లకు కష్టకాలంలోనూ పాజిటివ్ ఆలోచనలే వస్తాయి. తమ పాప బ్రెయిన్‌డెత్ కారణంగా చాలా కొద్ది సమయంలో చనిపోతుందని డాక్టర్లు తేల్చారు. ముద్దులు మూటగట్టే తమ చిన్నారి మట్టిలో కలిసిపోకూడదని, ఆ పాప అవయవాలు మరికొందరికి జీవితాన్నిస్తే... వారి శరీరంలో తమ బిడ్డను జీవింపజేయాలనే కోరిక తల్లిదండ్రులు, సహోదరుల్లో కలిగింది. ఇది 2005, ఆగస్టు 10న జరిగింది.

బ్రెయిన్‌డెత్ బారినపడిన కూతురు ఎదురుగా ఉన్నా, కొందరికి సాయపడాలని నిర్ణయించుకున్న ఆ కుటుంబం మనకి ఆదర్శం.

సాధారణంగా చని పోయినవాళ్లు కొంచెం పెద్దవారైతే తమవాళ్లకు తెలియజేసి తమంతట తామే 'మరణానంతరం తమ అవయవదానాన్ని ప్రకటించి రిజిస్టర్ చేస్తారు. మోహన్ ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థలతో...

చిన్నపిల్లలు అనుకోకుండా ఏ బ్రెయిన్‌హేమరేజ్ వల్లో మరణిస్తే తల్లిదండ్రులు పెద్దమనసుతో తమ పిల్లల అవయవాల్ని అవసరమైన వాళ్లకు దానం చేస్తారు. మధ్యవయసువాళ్లయితే భర్తపోతే అతని అవయవ దానాన్ని ఆమె భార్య, భార్యపోతే ఆమె అవయవదానాన్ని ఆమె భర్త ప్రకటించొచ్చు.

ఇలాంటి సంఘటన ఈమధ్య హైదరాబాద్‌లో జరిగింది. పొన్నూరు నుంచి ఒకామె తన భర్తను చికిత్సకోసం హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చింది. దురదృష్టవశాత్తూ అతను మరణించాడు. సాధారణంగా అయితే ఆ శరీరాన్ని బూడిద చేయడమో... మట్టిలో కలపడమో... వెంటనే జరిగే కార్యక్రమం. కానీ అందుకు భిన్నంగా ఇతరుల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి తోడ్పడే అవయవాలన్నింటినీ దానంచేసి మిగతా శరీరాన్ని వాళ్లూరు తీసికెళ్లి అంత్యక్రియలు చేశారు.

డోనర్‌కి ఎంత పెద్దమనసుంటుందో, ఆ డొనేషన్‌ను ఆచరణలో పెట్టించేవాళ్లకు అంతకన్నా పెద్ద మనసుంటుంది.

అందుకే వాళ్లు అంత పెద్ద కష్టంలో ఉండి కూడా, ఇతరుల కష్టాల గురించి ఆలోచించి, తమ కష్టం ఎలాగూ భర్తీచేయలేనిది కాబట్టి ఇతరులకైనా లాభం కలుగుతుందన్న ఆశతో దానానికి ముందుకొస్తున్నారు. ఈ పాప కె.ఆర్. జగన్మోహన్ కుమార్తె. మూత్రపిండాలు, కళ్లు ఇతరులకు దానం చేయడంతో చిరంజీవైంది.

✻



కథ

తప్పు

అవ్వారు అనీల్‌కుమార్

"యూ హ్యావ్ హెచ్ఐవి పాజిటివ్ సిమ్‌టమ్స్ మిస్టర్ రాకేష్" డాక్టర్ గణేష్ బాంబును పేల్చాడు.

"డాక్టర్..." ఆందోళన నిండిన కంఠంతో రాకేష్ కీచుగా అరిచాడు.

"ఎస్ రాకేష్ మీకే కాదు మీ భార్యక్కూడా హెచ్ఐవి పాజిటీవ్. ఈ విషయం మీకు ముందుగానే చెప్పాలి కాని చెప్పలేకపోయాను."

"అదేంటి డాక్టర్, నా భార్యకూ హెచ్ఐవి సోకిందా?" మరింత ఆందోళనకు గురయ్యాడు రాకేష్.

"అంతేకాదు మిస్టర్, నీ భార్య కడుపులో ఉన్న బిడ్డపై కూడా వ్యాధి ప్రభావం పడే ప్రమాదముంది" డాక్టర్ నెమ్మదిగా వివరించాడు.

"నో డాక్టర్.. అలా జరగడానికి వీల్లేదు. ఏదోకటి చేయండి" కంపించిపోసాగాడు రాకేష్.

పిడుగులాంటి వార్తలు వినడంతో రాకేష్ నిలబడలేక పోతున్నాడు.

కళ్లు బైర్లు కమ్ముతున్నాయి... తలతిరిగిపోతోంది... నేలను అంటిపెట్టుకున్న కాళ్లు పట్టును కోల్పోతున్నాయి... చేతులు వణికిపోతున్నాయి... మనిషి జావగారిపోయాడు.

నిండు గర్భిణీ అయిన భార్యను రొటీన్ చెకప్‌కోసం డాక్టర్ వద్దకు తెచ్చాడు. భార్యను పరీక్షించిన డాక్టర్ పండంటి బిడ్డకు తండ్రవుతావని చెబుతాడనుకుంటే నీకు ప్రాణాంతకమైన రోగం సోకిందని చెప్పడంతో రాకేష్ నిలువెల్లా కంపించిపోయాడు.

నిండా మూడుపదులు నిండని రాకేష్ కళ్లముందు అర్ధాంతరంగా ముగిసిపోతున్న జీవితం కనిపించసాగింది.

ఐదునిమిషాలు గడిచిందో లేదో నిలబడలేక పక్కనున్న కుర్చీ పట్టుకుని దానిలో చేరగిలపడ్డాడు.

రాకేష్‌ను అనునయించే ప్రయత్నం చేస్తున్నాడు డాక్టర్ గణేష్. కానీ డాక్టర్ చెబుతున్న మాటలు అతడికి వినిపించడం లేదు.

☆ ☆ ☆

"ఒరేయ్ అబ్బాయ్, ఈరోజు ఆఫీసులో సెలవు పెడ్తున్నాను రేపు రానని చెప్పిరా... నీకు పెళ్లిచూపులు.. పక్క ఊర్లో ఉన్న మన దూరపు చుట్టాలమ్మాయిని చూసేందుకు వెళ్తున్నాం సరేనా" అంది అనసూయమ్మ కొడుకుతో.

"సరేలేమ్మా అలాగే చెప్పివస్తాలే" సమాధానమిస్తూ ఆఫీసుకు వెళ్లిపోయాడు రాకేష్.

తల్లిచాటు బిడ్డగా పెరిగిన రాకేష్ సొంతూర్లోనే ఒక ప్రైవేటు కంపెనీలో ఒక మోస్తరు ఉద్యోగం చేస్తున్నాడు.

ఒక్కగానొక్క కొడుకు కావడంతో దూరపు ఊర్లు పంపడం ఇష్టంలేక ఉన్న ఊర్లోనే దొరికిన ఉద్యోగం చేసుకుంటూ కళ్లముందే ఉండమన్నారు రాకేష్‌ను తల్లిదండ్రులు.

ఆఫీసుకెళ్లిన రాకేష్ కంపెనీ మేనేజర్‌తో ఉన్న విషయం చెప్పి సెలవు అడిగి మంజూరు చేయించుకున్నాడు.

తెల్లారితే తనకు పెళ్లిచూపులు. అమ్మాయి ఎలా ఉంటుందోనన్న ఉత్సుకత రాకేష్‌ను పనిచేయనివ్వడం లేదు. తప్పదు కనుక పని అయిందనిపిస్తున్నాడు.

మనసులో మెదులుతున్న ఊహలు రాకేష్‌ను ఉన్నచోట నిలబడనీయడం లేదు.

"అయ్యగారికి కాలునిలవడం లేదు, ఎంటి విషయం?" ఆసక్తిగా అడిగాడు మిత్రుడు వెంకట్.

"రేపు నా పెళ్లి చూపులురా" హుషారుగా చెప్పాడు రాకేష్.

"అబ్బాయికి పెళ్లి చూపులకే నేల కనిపించడం లేదు. ఇక పెళ్లయితే మనమూ కనిపించమేమోరా" సందేహం వెలిబుచ్చాడు రాము.

"అదేం లేదులేరా, మొదటి పెళ్లిచూపులు కదా మనసంతా టెన్షన్ టెన్షన్‌గా ఉంది" అంటూ సమాధానమిచ్చాడు రాకేష్.

అలా రాకేష్ ఊహాలోకాల్లో తేలిపోతుండగానే

తెల్లారిపోయింది.

అనుకున్న ప్రకారం పెళ్లిచూపులకు వెళ్లడం, పిల్ల రాకేష్ ఊహల్లోకొచ్చిన అమ్మాయికంటే బాగుండడం, రాకేష్ తల్లిదండ్రులకు కట్నకానుకల విషయంలో పెద్ద పట్టింపులు లేకపోవడంతో వెంటనే రాకేష్ పెళ్లి జరిగిపోయింది.

పెళ్లయిన రెండేళ్లకు రాకేష్ భార్య పురుడు పోసుకుంది.

భార్య గర్భవతి కావడంతో రాకేష్ ఆమెను పువ్వుల్లో పెట్టి చూసుకున్నాడు.

రోజూ పెందలాడే ఆఫీసునుంచి రావడం, ఆమెతో కలిసి కబుర్లు చెప్పుకోవడం, ప్రతివారం ఆసుపత్రికి తీసుకెళ్లి చెకప్ చేయించడం ఇలా సాగిపోతోంది.

☆ ☆ ☆

నెలలు నిండడంతో పండటి పాపాయి బోసి నవ్వులతో తన ఇంట్లో అడుగుపెడుతుందని ఊహాలోకంలో తేలిపోతూ భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లాడు.

రాకేష్ భార్యను చెకప్ చేసిన డాక్టర్ రాకేష్‌ను కూడా టెస్ట్ చేయాలని చెప్పడంతో అయోమయంలో పడిన రాకేష్ డాక్టర్‌ననుసరించాడు.

పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రాకేష్‌ను ఒంటరిగా పిలిచి పిడుగులాంటి వార్త చెవిన వేయడంతో నోటమాట రాలేదు.

☆ ☆ ☆

"చూడు రాకేష్ రేపటినుంచి ఒక వారం రోజులపాటు మనం చెన్నై క్యాంపు వెళ్లాలి. అక్కడ కొన్ని పనులను పూర్తి చేసుకురావాలి. నాకు తోడుగా ఉంటూ చిన్నచిన్న పనుల్లో సహాయపడేందుకు నువ్వు నాతోపాటు రావాలి" అంటూ మేనేజర్ విశ్వనాథం ఆర్డర్ వేశాడు.

ఎప్పుడూ ఊరు వదిలి వెళ్లని రాకేష్ మొదటిసారి మేనేజర్‌గారు తనతో రమ్మనడంతో ఇష్టం లేకున్నా సరేనంటూ తలూపాడు.

"ఈరోజు రాత్రికే మనం బయలుదేరాలి. బట్టలు సర్దుకుని ఎనిమిదింటికల్లా బస్టాండుకు వచ్చేయ్" అంటూ వెళ్లిపోయాడు విశ్వనాథం.

ఇంటికెళ్లి భార్యను ఒప్పించి, తల్లిదండ్రులకు నచ్చచెప్పి చెన్నై వెళ్లాడు.

నాలుగురోజుల పాటు చెన్నైలో క్షణం తీరిక లేకుండా గడిపిన విశ్వనాథం, రాకేష్‌లు నాలుగోరోజు సాయంత్రానికి పనులన్నీ పూర్తి చేసుకున్నారు.

"ఏమోయ్ రాకేష్ ఇంతకుముందెప్పుడూ చెన్నై రాలేదుగా ఒక్కసారి సిటీ చుట్టిరావోయ్" అన్నాడు విశ్వనాథం.

పగలంతా సిటీలో కొన్ని ప్రాంతాలు తిరిగిన రాకేష్ కొన్ని వస్తువులు కొనుక్కొని సాయంత్రానికి రూమ్‌కు చేరుకున్నాడు.

రూమ్‌లో కలిసిన విశ్వనాథం "ఏమోయ్ ఏమేం చూశావ్? బీచ్‌కేమైనా వెళ్ళావా ఎలా ఉంది?". అంటూ ప్రశ్నించాడు.

"లేదుసార్ సిటీలో తిరిగొచ్చాను. బీచ్‌కెళ్లలేదు" సమాధానమిచ్చాడు రాకేష్.

"చెన్నై వచ్చి బీచ్ చూడకుండా వెళ్లేది ఎవరయ్యా? సాయంత్రమైందిగా వెళ్లి ఓసారి దాన్నికూడా చూసిరా" అన్నాడు విశ్వనాథం.

ప్రశాంతంగా ఉన్న వాతావరణం... చల్లగా వంటిని తాకుతున్న చిరుగాలి... ఉవ్వెత్తున ఎగసిపడ్తూ లేస్తూ ఒడ్డుకు వచ్చి వెనుతిరుగుతున్న అలలు రాకేష్ మనసును రంజింప చేస్తున్నాయి.

సముద్రపు నీటిని తాకుతూ ఒడ్డున నడుస్తుంటే చెప్పలేని అనుభూతి కలుగుతోంది.

క్రమంగా చీకట్లు ముసురుకున్నాయి.

"హాయ్ యంగ్‌మాన్, ఐయామ్ విదిత" వాట్స్ యువర్ గుడ్ నేమ్?" అంటూ ఓ అందమైన యువతి చేయందించడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చాడు రాకేష్.

జీన్స్, టీషర్ట్‌లో ఉన్న అమ్మాయి తనవైపే చేయిచాపి తననే చూస్తుండడం గమనించి తడబడ్డాడు.

"వాట్ మ్యాన్, వాట్ హ్యాపెండ్" అంటూ రెట్టించడంతో యథాలాపంగా చేయందించాడు రాకేష్.

అమ్మాయిలతో అంతగా పరిచయంలేని రాకేష్‌కి ఏమాత్రం పరిచయం లేని మహానగరంలో ఓ అందమైన అమ్మాయితో కలిసి బీచ్ ఒడ్డున నడవడం కొత్త అనుభూతినిస్తుంది.

ఎంతో ఫాస్ట్‌గా మూవ్ అవుతూ స్పీడ్‌గా మాట్లాడుతున్న విదితకు కొద్దిసేపట్లోనే దగ్గరయ్యాడు రాకేష్.



చీకటి ముదిరిపోయింది. రాకేష్, విదితల మాటల ప్రవాహం మాత్రం అంతులేకుండా సాగిపోయింది. నడిచినడిచి చివరకు ఓ జనసమ్మర్దంలేని ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ సెటిలయ్యారు.

☆ ☆ ☆

"రాకేష్, మీకెలా ఈ వ్యాధి ఎటాక్ అయిందో నాకు తెలీదు. కాని ఇప్పుడు మీ కుటుంబాన్ని వంశాన్ని మాత్రం అంతం చేసేందుకు తన రాక్షస హస్తాలను చాచింది. ఐయాం వెరీ సారీ" అన్నాడు డాక్టర్ గణేష్.

"ఈ దారుణమైన పరిస్థితినుంచి నేనెలా బయటపడాలో చెప్పండి డాక్టర్" రోదిస్తున్నాడు రాకేష్.

"ఓకే మిస్టర్ రాకేష్, బీ కేర్‌ఫుల్" అంటూ డాక్టర్ గదినుంచి బయటకు వెళ్లిపోయాడు.

రోజులు గడుస్తున్నాయి. తనకు, భార్యకు సోకిన ప్రాణాంతకమైన వ్యాధి గురించి ఇంట్లో చెప్పేందుకు రాకేష్‌కు ధైర్యం చాలడంలేదు.

ఎవరితోనూ మాట్లాడలేకపోతున్నాడు. ఒకచోట ప్రశాంతంగా కూర్చోలేక పోతున్నాడు.

ఈ విషయాలేమీ తెలియని భార్య, తల్లిదండ్రులు రాకేష్ ఎందుకు ముభావంగా ఉంటున్నాడో అర్థంకాక తలపట్టుకున్నారు.

అమాయకమైన భార్య ముఖం చూసే ధైర్యం కూడా చేయలేకపోతున్నాడు రాకేష్.

ఏదేమైనా క్షణికావేశంలో రాకేష్ చేసిన ఒక చిన్నతప్పు ముగ్గురి జీవితాల్ని ఫణంగా కోరింది.

బాహ్య ప్రపంచంతో ఏమాత్రం సంబంధం లేకుండా అప్పుడే భూమ్మీదకు వస్తున్న పసిపాప పెద్దలు చేసిన తప్పుకు పుట్టుకతోనే మృత్యువును మోసుకురావడమేంటి?!

తన ప్రాణాన్ని తీసుకునే హక్కే మనిషికి లేనప్పుడు పుట్టబోతున్న పసిపాపలను మరణశయ్యపైకి నెట్టే హక్కు ఎవరిచ్చారు? పొట్టనింపుకునేందుకు, కుటుంబాన్ని పోషించుకునేందుకు ఇలా అపరిచితులైన యువకులకు షేక్ హ్యాండ్‌లిస్తూ తమ జీవితాల్ని బలిచేసుకుంటున్న ఓ యువతి రాకేష్ జీవిత గమనాన్నీ మార్చేసింది.

ఎంతో ఆలోచించిన రాకేష్ ఓ నిర్ణయానికి వచ్చాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఓ గదిలోకి వెళ్లాడు. తాడును ఫ్యానుకు బిగించాడు. అదే సమయంలో అతని భార్య ఆవైపుగా వచ్చింది. కిటికీ లోంచి చూసింది. రాకేష్ అంటూ గావుకేక పెట్టింది. తలదించుకుని రాకేష్ తలుపు తీయక తప్పలేదు. అతన్ని పెనవేసుకున్న భార్య బోరుమంది. ఏదో వ్యాధి వచ్చినంతలో బలవన్మరణం కూడదని హితవు పలికింది. డాక్టర్‌తో రాకేష్ మాట్లాడిన అంశాలు తాను విన్నట్లు వివరించింది. చావు పరిష్కారం కాదనీ, మిగిలిన జీవితాన్ని తమలాంటి వారికోసం కేటాయించాలనీ ఇద్దరూ నిర్ణయించుకున్నారు. అంతా తెలిసీ తనను అసహ్యించుకోకుండా ఇంత సహృదయత ప్రకటించడము, పైగా అంత నిస్సహాయస్థితిలోనూ గొప్ప నిర్ణయం తీసుకోవడంతో రాకేష్ అవాక్కయ్యాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

✻

మనమూ- మన నమ్మకాలు

రాళ్ళూ - రత్నాలు

రుక్మిణి

రాళ్ళూరప్పలూ మన జీవిత గమనాన్ని మార్చి అదృష్టపథంలోకి లాగి అందలమెక్కిస్తాయని నమ్మే ఆస్తికులున్నారు. కనబడ్డ రాయినల్లా దేవుడిగా భావించి దానికి సాష్టాంగపడి మతిపోగొట్టుకునే వారున్నారు. ఓరాయికింత పస ఉందా..! కుంకుం బొట్లుపెట్టి, కొబ్బరికాయలు కొట్టి, హారతులు పట్టి, అగరొత్తులెలిగించే జనం ఒకరకం.

అజ్ఞానం, జ్ఞానదారిద్ర్యం, క్షీణించిన హితవాద తార్కిక దృష్టి, అవిద్య, ఇవన్నీ దీనికి కారణాలు కావచ్చు.

ఇది కాకుండా పెద్దచదువులు చదివి బడా ఉద్యోగాలు వెలగబెడుతున్నవారి డాబు సరేసరి. నాగరికులుగా చెప్పుకునే మహామహులు కూడా ఈ రాళ్ల మహిమలో కొట్టుకుపోవడం చాలా విచిత్రం.



నా మిత్రుడు రాజేశం నన్ను ఆ సాయంత్రం ఒక స్వామీజీ ఇంటికి తీసుకుపోయాడు. అది చిన్న డాబా ఇల్లు. ముందుగదిలో విభూదిచారలు పులుముకున్న ఒక ఆసామి కూర్చున్నాడు. నేనూహించినట్టు ఆయనే స్వామీజీ. అప్పటికే అక్కడికి మాలాంటివాళ్లు కొంతమంది వచ్చి పోయినట్లున్నారు. మేము చాపమీద కూర్చున్నాం.

"నా ప్రియమిత్రుడు రెడ్డి" అంటూ రాజేశం నన్ను పరిచయం చేశాడు.

"పూర్తి పేరు... పుట్టిన తేదీ... సమయం... సంవత్సరం వగైరా వివరాలు చెప్పండి" అని స్వామీజీ నన్నడిగాడు. నేను గబగబా చెప్పాను. అతనో కాగితంమీద ఏవో గీతలు గిలికి తల అటూఇటూ ఆడించాడు.

"పుష్యరాగం సూటవుతుంది... చూడండి రెడ్డి గారూ... మీ సర్వతోముఖాభివృద్ధికి రాహువు అడ్డుపడుతున్నాడు. నాలుగింట శనిగాడు ఓరచూపులు చూస్తున్నాడు. దీనికి విరుగుడు పుష్యరాగమే!"

అంటూనే చిన్న సొరుగు తెరచి అందులోవున్న సంచిలోంచి కొన్ని రంగురాళ్లను బల్లమీద గుమ్మరించాడు. అవి వివిధ సైజుల్లో ఉన్నాయి. కొన్ని గుండ్రంగా... మరికొన్ని అండాకారంగా... హగ్గుజిలా... చతురస్రాకారంగా... ఉండి మెరిసిపోతున్నాయి.

"పుష్యరాగం... గోమేధికం... మాణిక్యం... మరకతం... ఇవన్నీ ఉత్తుత్తి గాజురాళ్లనుకుంటే పొరపాటే. ఇవి చాలా పవర్‌ఫుల్... అట్లా అని ఎవరిష్టమొచ్చినట్టు వారు ధరిస్తే రివర్స్... మటాష్... అయిపోతుంది" అని చెప్పుకెళ్తున్నాడాయన.

ఇవన్నీ నేను ఊపిరి బిగబట్టి వింటున్నాను.

"డాక్టర్ రోగాన్ని ముందు గుర్తించి తర్వాత మందులిస్తారు. మనం మన కుండలినీ... నక్షత్రం... జాతక చక్రం వేసి మన సమస్యలూ, కష్టాలూ తీరడానికి ఏది సూటవు తుందో దాన్ని వుంగరంలో ధరిస్తే ఇకనంతా మంచే జరుగుతుంది...!"

"అదేంటీ... ఉంగరంలో రాయికీ... నిజజీవితానికీ సంబంధముంటుందా...!" అనడిగితే "ఇవి నవరత్నాలు... అటు నవగ్రహాలు... మన శరీరంలో నవభాగాలు (నవరంధ్రాలు కూడానూ... కసిగా మనసులో అనుకున్నాను) వీటన్నింటికీ లింకుంది. ఒక్కో గ్రహాన్ని ఒక్కో రాయి కంట్రోలు చేస్తుంది. ఒక రైతు ఆసామి నెలకిందట వచ్చాడు. వ్యవసాయంలో అపార నష్టాలు... కుండలినీ... జాతకం చూస్తే అతనిమీద అంగారకుడు అలిగాడు. 'మరకతం' తీసుకుని అరతులం వెండిలో పూడ్చి, ఉంగరం చేయించి కుడిచేతికి ధరింపజేశాను. అతనికిపుడు అంతా లాభమే...!"

"అదెట్లా సాధ్యం?" అనగానే రాజేశం నన్ను నమిలి మింగేసేలా చూశాడు. నన్నో కసురు కసిరాడు.

ఇక రాజేశం మొదలెట్టాడు. "రావు గారూ... వీడికి పుష్యరాగం వేసేయండి" అంటూ ఆర్డరిచ్చి, నావైపు చూస్తూ "ఏరా...! ఏ రాయి కావాలో చెప్పు" అనడంతో పుష్యరాగంతో కూడిన కొన్ని రంగురంగుల రాళ్లను ఆ స్వామీజీ మళ్లీ తీసి చూడమన్నాడు. దాన్లోంచి ఓ పుష్యరాగం రాయిని నా స్నేహితుడే ఎంపిక చేశాడు.

"అరతులం వెండితో చేస్తే ఐదొందలవుతుందని, తులమైతే వెయ్యి రూపాయలవుతుంది" అని స్వామీజీ సెలవిచ్చాడు.

మావాడు చొరవగా నాచేత ఐదొందలిప్పించాడు. అనంతరం ఇద్దరం అక్కడినుండి బయటపడ్డాం. నేను పకపకా నవ్వుతూ హోటల్లోకి దారితీసి కాఫీ ఆర్డర్ చేశాను. రాజేశం నా ఎదురుగా కూలబడ్డాడు. అప్పటికే వాడి చేతివేలికి మెరిసిపోతున్న 'గోమేధకం' ఉంగరం ఉంది.

"ఒరే నువ్వు నా చిన్ననాటి స్నేహితుడివి. అయినా ఇంతకాలం నువ్వింత మూర్ఖుడివనుకోలేదు. సౌరకుటుంబంలో వున్న గ్రహాలు తొమ్మిదికాదు వేలకోట్లు. నెబ్యులా... మనమూ... ఒకే గ్రహం మీద బతుకుతున్నాం. ఈ గ్రహాలకూ, మన జీవితాలకూ ఎలాంటి సంబంధమూ లేదు. మోకాలికీ, బోడి గుండుకీ లింకులు పెట్టొద్దు. ఈ రాళ్ళు భూగర్భంలో దొరికేవే. కాలాన్నిబట్టి విలువైనవే. అవి కార్బన్, సిలికాన్‌ల సమ్మేళనాలు. అయితే వీటికీ ఆ గ్రహాలకూ ఎలాంటి శాటిలైట్ ఫ్రీక్వెన్సీ సంబంధాలూ ఉండవు. నీ జీవితానికి కూడా. వీటిని వేలికి పెట్టుకుంటే పిల్లలు పుడతారు... ప్రమోషన్లొస్తాయి... పంటలు విరగపండుతాయి... అంటే గూబ పగలకొడతాను. 'ఇటీజ్ ఎ బిజినెస్' ఈమధ్య టీవీల్లో వీటిగురించి విపరీతమైన ప్రచారం... అలాగే ఏకాదశ... ద్వాదశ... అష్టాదశ...ఉంగరాలనడం అవన్నీ ఒట్టి హంబక్. నా జన్మ తేదీ... సంవత్సరం... అన్నీ తప్పు చెప్పాను. దాంతోనే అతడు అంచనా వేసి పారేశాడు. జన్మ నక్షత్రం ఎలా తప్పో ఈ పుష్యరాగం కూడా అంతే" అన్నాను.

ఇది విన్న రాజేశం నోరెళ్లబెట్టాడు.

*

అవీ... ఇవీ

జె.కె. భారవి

చెప్పు

పరిస్థితి చెప్పు
విడమర్చి చెప్పు
మారమని చెప్పు
మార్పు అవసరమని చెప్పు
మళ్ళీ చెప్పు
మరోసారి చెప్పు
అప్పటికీ వినకపోతే
తీసుకో చెప్పు

పాముప్రశ్న

పాలు పోసినవాణ్ణే
కాటేస్తున్నానని
నన్ను చంపేస్తున్నారు
ఓకే
ఓటేసినవాణ్ణే
పోటేస్తుంటే
ఏం చేస్తున్నారు మరి?!



రంగుపిచ్చి

అంజలి: ఫెయిరెండ్ లవ్లీ, ఫెయిరెవర్ లాంటి ఫెయిర్‌నెస్ క్రీములెన్ని వాడినా ప్రయోజనం లేకపోయింది. ఇంకేమైనా కొత్త క్రీములొచ్చాయా?

శాపతను: మీ రంగుకేమైందమ్మా, బాగానే వున్నారుగా

అంజలి: చాల్లే సంబడం, ఇదో రంగా? నాకు తెల్లగా మెరిసిపోవాలని వుంది

శాపతను: 'అయితే కాస్త సున్నం రాసుకో' అని సణుక్కున్నాడు

అంజలి: ఏంటో వినిపించలేదు

శాపతను: ఏంలేదమ్మా, ఇంకో కొత్త క్రీమ్ మార్కెట్లోకొచ్చిందిలే, తెస్తానుండండి

అంజలి: ఏంటీ, ఏభైగ్రాముల డబ్బా వెయ్యి రూపాయలా?

శాపతను: మరది బంగారం, ముత్యాల పొడితో తయారైంది కదండీ

అంజలి: నిజమా?

శాపతను: నాకేం తెలుసండీ, అదృష్టవశాత్తూ నాకు రంగుపిచ్చిలేదు

అంజలి: ఏమనలేక పళ్ళు కొరుక్కుంది.

- ఎన్నార్

ఏదీ ఫ్లాష్ పడనేలేదు... ఇంతకీ ఫొటో తీశావా లేదా?!

మనసా... తెలుసా?

ఉద్వేగాల పోకడను గ్రహించాలి

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్: 9849130141

కొంతమంది పిల్లలు ఎంతగా తిట్టినా పెద్దగా పట్టించుకోరు. అమ్మానాన్నలు తిట్టినవాళ్ళు తిట్టినట్టే వుంటారు. పిల్లలు పడ్డవాళ్ళు పడినట్టే వుంటారు. వారిలో ఏ మార్పు వుండదు. వారిని తిట్టే పెద్దల్లోనూ ఏ మార్పూ వుండదు. ఎవరి పద్ధతి వారిదే. మరి కొంతమంది పిల్లలు ఎవరైనా పల్లెత్తు మాట అంటేచాలు బోలెడంత బాధ పడిపోయి రోజుల తరబడి తిండి తిప్పలూ మానేసి మూడీగా వుండిపోతారు. లేదా ఒక విధమైన వైమనస్యాన్ని సంతరింపచేసుకుంటారు. ఇంకో కోవకు చెందిన పిల్లలు మరీ డేంజర్. ఇంట్లో ఎవరైనా ఏదైనా అనడం పాపం వెంటనే ప్రతికూల నిర్ణయాలను తీసుకోవడానికి తెగించేస్తారు. అలాని ఈ వైఖరి అందరు టీనేజ్ పిల్లల్లోనూ ఒకేవిధంగా వుంటుందనేదేం లేదు. ఒక్కొక్క తరహాకు చెందిన పిల్లలు ఒక్కోలా ప్రవర్తిస్తారు. మొండిగా తయారైన పిల్లలు మాట వినకుండా, పెద్దలు ఎంత తిడుతున్నా దులిపేసుకుని పోతుంటారు. ముభావంగా వుండే పిల్లలు తిట్టినా, పొగిడినా మూడీగానే వుండిపోతారు. కాగా ఈ విషయంలో మనం ఆందోళన పడాల్సిన అంశం ఒకటుంది. అదేమిటంటే కొంతమంది పిల్లలు ఎంతగా మనసు తూట్లు పడేట్లు తిట్టినా మొండి వైఖరిని ప్రదర్శిస్తూనే హఠాత్తుగా ఏదోఒక ప్రతికూల సందర్భంలో మనసు కష్టపెట్టుకుని తమ జీవితాలను అంతం చేసుకునే చర్యలకు పాల్పడతారు. ఇటువంటి పిల్లలతోనే చాలా ఇబ్బందులనెదుర్కోవల్సి వస్తుంది. వీళ్లు ఎప్పుడెలా ప్రవర్తిస్తారో అర్థంకాదు. ఎంత తిట్టినా మార్పులేకుండా మొండివైఖరిని ప్రదర్శిస్తున్నట్లయితే వీరి తల్లిదండ్రులకు సమస్యను వేరే కోణంలో పరిశీలించే అవకాశం వుండదు. తమ తిట్లను తగ్గించుకోవల్సిన అవసరం కన్పించదు. పైగా ఎప్పటికప్పుడు వీళ్ల జగమొండి పిల్లల్లా కన్పించడం వల్ల తమ తిట్ల పురాణాన్ని మరింత సాంద్రత పెంచి సాగిస్తేనన్నా ఫలితం వుంటుందేమోనన్న ఆలోచన కలుగుతుంది. దీంతో వారి మనోభావాలు ఎప్పుడెలా పరిమణమిస్తాయో ముందుగానే పసిగట్టగలిగే నేర్పు కొరవడుతుంది. మీకో ఉదాహరణ చెప్తాను.

గోపాల్ పదోతరగతి చదువుతున్నాడు. అప్పటికి చాలారోజులనుంచి అతగాడు చదవడం మానేశాడు. ఎంతచెప్పినా వినకుండా రోజురోజుకీ మరీ మొండివాడిగా మారాడే తప్ప అతనిలో మార్పురాలేదు. దీనికి తోడు చెడు స్నేహాలు మరిగాడు. చెప్పిచెప్పి అతని తల్లిదండ్రులు విసుగెత్తి పోయారు. ఎవరేం తిట్టినా గోపాల్ లెక్కచేయడం మానేశాడు. తనకు చదువు రావడంలేదన్న దిగులు ఏ కోశానా లేదు. పరీక్షలు దగ్గర పడుతున్నకొద్దీ అతని పరిస్థితి మరీ దిగజారిపోసాగింది. స్కూల్ ప్రిన్సిపాల్ మాటలను కూడా ధిక్కరించడం మొదలెట్టాడు. టీచర్ల మాటలకు దిక్కేలేదు. విసిగిపోయిన ప్రిన్సిపాల్ అతన్ని మరీ ఎక్కువగా శిక్షించడం మొదలు పెట్టాడు. నలుగురిలో గోపాల్‌ని కించపరుస్తూ మాట్లాడసాగాడు. దేనికీ చలించని గోపాల్‌కు ఇది గొప్ప విషయం కాదుగానీ అమ్మాయిలముందు ఆయనిలా కించపరుస్తూ మాట్లాడు తూంటే అతనికి చాలా అవమానంగా తోచింది.

ప్రిన్సిపాల్‌పై కక్ష పెంచు కోసాగాడు. చెడు స్నేహాల ప్రభావం, గాడితప్పిన జీవితం, చదువు దూరం కావడంవల్ల కొరవడిన వివేకం ఇవన్నీ అతన్ని మూర్ఖుడ్ని చేశాయి. తనకు చదువుచేప్పే గురువు స్థానంలో వున్న ప్రిన్సిపాల్ పైనసే కక్ష సాధింపు ధోరణిని పెంచుకున్నాడు. కొంతమంది రౌడీ మూకలతో చేరి ఆయనను నడిరోడ్డుపైన గాయపరిచి దెబ్బతీయాలనుకున్నాడు. కంట్లో కారం జల్లి ఆయనపై పడి దాడిచేయాలని స్కెచ్ వేశాడు. ప్రిన్సిపాల్‌గారి తెలివితేటల కారణంగా ఆయన ఆ ప్రమాదం నుండి తప్పించుకోగలిగాడు. ఈ విషయం తెలిసిన అతని తల్లిదండ్రులు సిగ్గుతో కుమిలిపోయారు. ఇల్లు చేరింతర్వాత గట్టిగా తిట్టి, కొట్టి దారిలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా ప్రయోజనం శూన్యం. ఇంతలో పరీక్షలు రానే వచ్చాయి. ఏదో మొక్కుబడిగా రాశాడు. 'వీడిక ఛస్తే బాగుపడడ'ని ఒక నిశ్చయానికి వచ్చేశారు. అందరూ అనుకున్నట్టుగానే మనవాడు 3 సబ్జెక్టులలో ఫెయిలయ్యాడు. అంతవరకు కొంతమేర సహించగలిగిన అతని తల్లిదండ్రు లకు విరక్తి కలి గింది. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. ఈ గొడవను చూసినవారంతా గోపాల్ ఏదైనా అఘాయిత్యానికి పాల్పడతాడని తలపోశారు. కానీ ఇంత జరిగినా అతనిలో పరివర్తన రాలేదు. పెద్దల మందలింపును ఈ చెవితో విని ఆ చెవితో వదిలిపెట్టేశాడు.

క్రమంగా తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు అతని పోకడకు అలవాటు పడిపోయారు. వీడికెంత చెప్పినా ఏమాత్రం ప్రయోజనం వుండదనే అభిప్రాయానికి వచ్చేశారు. చేసేదేంలేక మళ్ళీ పరీక్షకు ఫీజు కట్టారు. స్కూల్ జీవితం ముగిసిపోవడం అతన్ని మరీ సోమరిలా తయారు చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు దగ్గర పడుతూండగా కాసేపైనా చదవమని అతని తాతగారు కాస్త మందలింపు ధోరణిలో తిట్టారు. గోపాల్‌కి ఏం జరిగిందో తెలీదు కానీ రోషం ముంచుకొచ్చి హఠాత్తుగా గోదావరిలో దూకి దుర్మరణం పాలయ్యాడు. అతని చర్య అందరికీ దిగ్భ్రాంతిని కల్గించింది. ఎప్పుడూ ఎవరేం అన్నా ఎదురు తిరిగే స్వభావం, మొండితనం ఏర్పరచుకున్న గోపాల్ ఇలా ఆత్మహత్య చేసుకుంటాడని ఎవరూ ఊహించలేదు. ఇది కల్పించిన కథ కాదు. బాగా పేరున్న ఒక స్కూల్లో నిజంగా జరిగిన సంఘటన. పిల్లల మూడ్ ఎప్పుడెలా మారిపోతుందో తెల్చి చెప్పడం చాలా కష్టం. ఎంత తిట్టినా ఏమాత్రం చలించని ఈ కుర్రాడు తాతగారన్న మాటలకు ఇంతగా కదిలి పోయాడంటే స్వభావం ఎంతత్వరగా రంగులు మార్చేసుకుంటుందో అర్థంచేసుకోవచ్చు. కనుక తస్మాత్ జాగ్రత్త. పిల్లలు మరీ మొండితనం చూపుతున్నట్లయితే సైకియాట్రిస్టు లేదా సైకాలజిస్టు సహాయం తీసుకోండి.

*

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

పొలాల్లో పండించే ఇంధనం

అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోలియం ధరలు ఆకాశాన్నంటుతుంటే మన వంటింటి బడ్జెట్లు తల్లకిందులౌతున్నాయి. రెండేళ్ల క్రితంవరకు పెట్రోలు ముప్పయి రూపాయలంటే అమ్మో అనుకునేవారు కాస్తా ఇప్పుడు లీటరు యాభైరూపాయలకు పోయించుకుంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ చమురు ధర 70 డాలర్ల దగ్గరుంటే పరిస్థితి ఇది. కాని త్వరలోనే ఇది 100 డాలర్లు దాటుతుందంటున్నారు. మరి అప్పుడు మనం మార్కెట్లో పెట్రోలు ఎంతకు కొనాల్సివస్తుందో తెలీదు.

వాహనాలు ఇదే పద్ధతిలో పెరుగుతూ పోతూంటే రానున్నకాలంలో పెట్రోలియం అందుబాటులోనే ఉండదంటున్నారు. ఎందుకంటే పెట్రోలియం అనేది భూమిలో ఎప్పటికప్పుడు పుట్టేది కాదు. ఎప్పుడో కోటానుకోట్ల సంవత్సరాలక్రితం భూమ్మీద నివసించి మరణించిన జంతుజాలంనుండి పెట్రోలియం తయారవగా, వృక్షజాలంనుండి బొగ్గు తయారైంది. అందుకే వీటిని శిలాజ ఇంధనాలంటారు.

మనం వాహనాల వాడకాన్ని పెంచే స్తున్నకొద్దీ భూమిలోంచి బయెూ ఇంధనాన్ని తోడే యడం అధికమైంది. ఈ విషయంలో అమెరికావాళ్లు అందరికన్నా ముందున్నారు. ప్రపంచ జనాభాలో 5శాతం ఉన్న ఆ దేశం ప్రపంచ ఇంధనంలో 25శాతం వాడేస్తున్నారు. ఇప్పుడె లాంటి స్థితి వచ్చిందంటే అమెరికా వాళ్లలాగా ఇతరదేశాలూ.. ముఖ్యంగా ప్రపంచం లోనే పెద్ద దేశాలైన చైనా, భారత్‌లూ ఇంధనాన్ని వినియోగిస్తే ప్రపంచంలో నిలవున్న బయోఇంధనాలన్నీ అంతరించి పోతే ప్రపంచాభివృద్ధి గందర గోళంలో పడిపోతుంది.



ఇప్పుడు శిలాజ ఇంధనాలకు (ఫోజిల్ ఎనర్జీ) ప్రత్యామ్నాయ ఇంధనాలైన అణు ఇంధనం, సౌర ఇంధనం, పవన ఇంధనం, అలల ఇంధనం...వగైరా. ఈ ఇంధనాల తయారీకోసం ప్రపంచవ్యాప్తంగా అనేకచోట్ల పరిశోధనలు జరుగుతున్నాయి. దాదాపు ప్రతిరోజూ ప్రపంచంలో ఏదో ఒక మూల ప్రత్యామ్నాయ ఇంధనాలపై కొత్త ఆవిష్కరణలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇవేవీ ఇప్పటివరకు వాణిజ్యపరంగా జయప్రదంకాలేదు. అనేక సాంకేతిక సమస్యలను ఇంకా అధిగమించాల్సి ఉండడం, కొన్నిరకాల ఇంధనాలు కొన్ని ప్రాంతాలకే పరిమితంకావడం ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. ఉదాహరణకు అణు ఇంధనం వినియోగంలో అనేక ప్రమాదాలు దాగి ఉన్నాయి. అలల ఇంధనాన్ని సముద్రప్రాంతంలో మాత్రమే వినయోగించుకోడానికి వీలవుతుంది. సౌర ఇంధనాన్ని రాత్రివేళల్లో ఉత్పత్తిచేయడం సాధ్యంకాదు. పవనశక్తి అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని వేళల్లోనూ ఉండదు. అందువల్ల ఈ ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనేక పరిమితులేర్పడ్తున్నాయి.

అయితే ఇప్పుడు ఇటువంటి సాంకేతిక సమస్యలతో నిమిత్తంలేని, తక్షణం ఇంధనంగా ఉపయోగించగల ప్రత్యామ్నాయ ఇంధనంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. వారి దృష్టిలో పడ్డ అటువంటి ఇంధనం జీవ ఇంధనం (బయో ఎనర్జీ). అంటే ఎప్పుడో చరిత్రలో బ్రతికి, చనిపోయిన జంతువులు, మొక్కలను ఉపయోగించుకోవడం కాకుండా ఇప్పుడు భూమ్మీద అటువంటి జీవరాశులను పెంచి ఇంధనంగా ఉపయోగించుకోవడం. నిజానికి ఈ ప్రక్రియ ఇప్పుడు శాస్త్రవేత్తలు కొత్తగా కనిపెట్టిందేం కాదు. మానవుడు ఆవిర్భవించినప్పటినుండి భూమ్మీద పెరిగే వృక్షాలు, జంతువులను ఇంధనంగా ఉపయోగించుకుంటున్నాడు. కట్టెలు, పిడకలు, జంతుకొవ్వులు ఇంధనంగా అనాది నుండి ఉపయోగించుకుంటున్నాడు. అయితే ఇప్పుడు శాస్త్రవేత్తలు అవే కట్టెలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయగలిగే వృక్షాలను పెంచడంద్వారా ఇంధనావసరాలు తీర్చడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే కొన్నిరకాల మొక్కలనుండి నేరుగా ఇంధనాలు తయారుచేసి వాహనాల్లో వినియోగించుకునే ప్రయత్నాలను కూడా ముమ్మరం చేశారు. అంటే ఇకపై ఇంధనాన్ని భూమిలోంచి తీయడం కాకుండా పొలాల్లో పండించనున్నారన్నమాట.

బయెూ ఇంధనంలో రెండు రకాలున్నాయి. మొదటిది బొగ్గు, సహజవాయువులను మండించే స్థానంలో ప్రత్యామ్నాయంగా మండించగలిగే కట్టెలు. రెండోది పెట్రోలు, డీజిల్ వంటి వాటి స్థానంలో ఉపయోగించగల ప్రత్యామ్నాయ ఇంధనం. మొదటి ఇంధనాన్ని అతిశీఘ్రంగా పెరిగే వృక్షాలను పెంచడంద్వారా తయారు చేయబూనుకుంటున్నారు. ఇలా శీఘ్రంగా పెరిగే వృక్షసంపదను 'ఇంధన వృక్షాలు' లేదా 'క్లోజ్‌డ్ లూప్ బయోమాస్' అంటారు. సూబాబుల్ వంటి త్వరగా పెరిగే వృక్షాలను శాస్త్రీయపద్ధతిలో పెంచి కొలిముల్లో కాల్చడంద్వారా విద్యుత్‌ను తయారుచేస్తారు. ఈ వృక్షాలే కాకుండా వ్యవసాయ వ్యర్థ పదార్థాలను కూడా ఈ పనికోసం ఉపయోగించు కోవచ్చు. ఈ వ్యర్థాలను ఒత్తిడితో చిన్న చిన్న ఇంధన కణికలుగా మార్చి కొలుములకు తరలిస్తారు. ఇటువంటి బయోమాస్‌వల్ల బొగ్గు వాడకాన్ని బాగా తగ్గించవచ్చు. ఒకరకంగా వీటిని బొగ్గుకు ప్రత్యామ్నాయంగా పరిగణిస్తున్నారు. అయితే భవి ష్యత్తులోనే కాదు ఇప్పటికిప్పుడు ఇటువంటి 'ఇంధన వృక్షాల'ను వినియోగించుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. ఉదాహరణకు బొగ్గు, సహజ వాయువుతో నడిచే విద్యుత్ కేంద్రాల్లో ప్రస్తుతం 5శాతం ఇటువంటి బయోమాస్‌ను కలిపి మండిస్తున్నారు. దీనివల్ల విద్యుత్ కేంద్రాల డిజైన్ ఏమాత్రం మార్చకుండానే 5శాతం బొగ్గు లేదా సహజవాయువును పొదుపు చేయగలుగుతున్నారు. పూర్తిగా ఇంధన వృక్షాలు లేదా వ్యవసాయ వ్యర్థాలను కాల్చడంద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే డిజైన్ మార్చాల్సి ఉంటుంది.

ఇక శిలాజ ఇంధనానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించే మరో ఇంధనం బయో డీజిల్. జట్రోపా, చెరుకు, తీపి జొన్న, సోయా చిక్కుడు వంటి మొక్కలనుండి నేరుగా ఉత్పత్తి చేసే డీజిల్‌ను నేరుగా వాహనాల్లో వాడుకోవచ్చు. ఇప్పటికే జట్రోపా గింజలనుండి, తీపి జొన్న నుండి, సోయా చిక్కుడు నుండి తీసిన ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపి అమ్ముతున్నారు. 5శాతం బయో ఇథనాల్ కలిపిన డీజిల్ బాగా పనిచేస్తుందని కూడా చెబుతున్నారు. రానున్నకాలంలో బయో డీజిల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తిచేసి ఇంధన సంక్షోభం నుండి బయటపడాలని అమెరికా, ఇతర యూరప్ దేశాలు ఆతృత పడుతున్నాయి. దీనికోసం అవి బయో డీజిల్ ఉత్పత్తికి సంబంధించిన పరిశోధనలపై విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి. ఇటువంటి జీవ ఇంధనాలవల్ల పర్యావరణానికి కూడా చాలా మేలు జరుగుతుంది. ఎందుకంటే జీవ ఇంధన మొక్కలు చాలా శీఘ్రంగా పెరుగుతాయి. అందువల్ల అవి కిరణజన్య సంయోగ క్రియ ద్వారా ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవడంకోసం వాతావరణంలోని బొగ్గుపులుసు వాయువు (కార్బన్ డై-ఆక్సైడ్)ను త్వరగా, ఎక్కువగా పీల్చుకుంటాయి. దీనివల్ల ఇప్పుడు వాహనాలద్వారా విడుదలై వాతావరణంలో చేరి గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌కు కారణమవుతున్న బొగ్గుపులుసు వాయువు తగ్గిపోతుంది. కనుక మానవాళి ఎదుర్కొంటున్న ఒక పెద్ద సమస్యకు ఆ విధంగా పరిష్కారం కూడా లభిస్తుంది. అందుకే రెండువిధాలా లాభదాయకమైన ఇంధన వృక్షాల పెంపకం కోసం ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు ముమ్మరమవుతున్నాయి. అయితే మన దేశంలో మాత్రం ఇవి కావలసినంతగా జరగడం లేదన్నదే మనందరికీ విచారం కలిగించే అంశం.

కొత్త పుస్తకాలు

చారిత్రక పోరాట ప్రభావాన్ని ప్రతిబింబించిన కథా సాహిత్యం



నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సాయుధులై తిరుగుబాటు చేసిన మహోజ్వల ఘట్టం తెలంగాణా పోరాటం. నిజాం నియంతృత్వ పాలన నుండి వేలాది గ్రామాలను విముక్తంచేసి ప్రజారాజ్యాన్ని స్థాపించుకున్న రోజులు. లక్షలాది ఎకరాలను భూస్వాముల కబంధ హస్తాలనుండి తప్పించి శ్రామిక రైతులు, కూలీలు సాగుచేసుకున్న వాస్తవమది. సాయుధ పోరాటం తెలంగాణా ప్రాంతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆనాటి ప్రజానీకంలో ఉవ్వెత్తున చైతన్యాన్ని ప్రవహింపజేసింది. నిరంకుశ రాజ్యానికి వ్యతిరేకంగా సామాన్య ప్రజానీకం సాయుధులై ప్రాణత్యాగాలకు సంసిద్ధమయ్యారు. ఆనాటి తెలంగాణా సాయుధ పోరాటం ప్రపంచవ్యాప్తంగా ప్రచారానికి నోచుకుంది. కమ్యూనిస్టుల నాయకత్వంలో విప్లవస్ఫూర్తితో ప్రజలు చైతన్యకెరటాలే అయ్యారు. సామాన్యులు సైతం అసమాన చైతన్య ప్రతీకలైన సందర్భం. చరిత్రలో శాశ్వత స్థానాన్ని పొందిన తెలంగాణా సాయుధ పోరాటం కేవలం ఒక చైతన్యపూరిత తిరుగుబాటే కాదు పలు రకాల అనుభవాలను అందించిన సామాజిక సంఘటన. ఒక చారిత్రక వాస్తవం. సహజంగానే ఈ పోరాటం అన్ని వర్గాల ప్రజలతోపాటు కవులూ, రచయితలూ, కళాకారుల మీద కూడా తన ప్రభావాన్ని చూపింది. తెలంగాణా పోరాట ప్రభావంతో వచ్చిన కథలపై సమ్మెట నాగమల్లీశ్వరరావు సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధనా గ్రంథం 'తెలంగాణా పోరాట కథలు'. ఈ అంశాన్ని పరిశోధనకు చేపట్టిన రచయిత అభినందనీయుడు.

పుస్తకం ముందుమాటల్లోనే ముద్రాపకులు పుస్తకం ఆలస్యంగా ప్రచురింపబడటాన్ని ప్రస్తావించారు. చారిత్రక ప్రాధాన్యతగల విషయాలపై రాసిన ఇలాంటి పుస్తకాలు ఆలస్యంగా రావడం విచారకరం. 1990 లో రాసిన ఈ పుస్తకం ఇప్పటికైనా వెలుగులోకి రావడం సంతోషకరమే.

ఈ పుస్తకంలో తెలంగాణా సాయుధ పోరాటం ప్రభావంతో వచ్చిన కథా సాహిత్యంపై నిర్దిష్ట చర్చ చేశారు. రచయిత పోరాట ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తెలంగాణ-పోరాటం-కథలు పేరుతో మొదటి అధ్యాయాన్ని రాశారు. ఈ మొదటి అధ్యాయంలో తెలంగాణా పరిచయం, నిజాం పరిపాలన, తెలంగాణ ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన పరిస్థితులు, తెలంగాణా సాయుధ పోరాటం, తెలంగాణా పోరాట సాహిత్యం-కథలు శీర్షికలతో ఆయా అంశాల గురించి రాశారు. వీటిలో తెలంగాణా ప్రాంత చారిత్రక విషయాలను, అప్పటి తెలంగాణా నైసర్గిక స్వరూపాన్ని, ప్రాంత ప్రాచీనతను, హైదరాబాద్ సంస్థాన పరిపాలనా విధానాలను విపులంగా వివరించారు. ప్రధానంగా నిజాం నవాబుల దుష్ట పరిపాలనలో కనీస స్వేచ్ఛలేని పరిస్థితులు, ప్రజల కడగండ్లు, ఫలితంగా నిరాశానిస్పృహలతో ఉన్న ప్రజానీకం క్రమంగా సాయుధపోరాటం దిశగా వెళ్ళడానికి గల పరిస్థితులను ఈ అధ్యాయంలో చర్చించారు. తెలంగాణా సాయుధ పోరాట నేపథ్యాన్ని అప్పటి పరిస్థితులను చాలా సమర్థవంతంగా రచయిత ఈ విభాగంలో వివరించారు.

పోరాట పూర్వకాలపు కథల అధ్యాయంలో కాళోజీ నారాయణరావు 'మనమే నయం', పొట్లపల్లి రామారావు 'మామూళ్ళు', వట్టికోట ఆళ్వారుస్వామి 'పరిగె', సురవరం ప్రతాపరెడ్డి 'సంఘం పంతులు', కాంచనపల్లి చిన వెంకటరామారావు 'ఆకలి', ఆవుల పిచ్చయ్య 'ఈతగింజ ఇచ్చి తాటిగింజ లాగిన జమీందారు' తదితర కథలను రచయిత పరిశీలించారు. ఆనాటి ప్రజానీకం ఎదుర్కొన్న దయనీయ పరిస్థితుల ప్రభావంతో ఆయా కథలు చిత్రించడాన్ని రచయిత ప్రతిభావంతంగా వివరించారు.

పోరాటకాలపు కథలుగా ఆవుల పిచ్చయ్య 'ఊరేగింపులు', పర్చా దుర్గాప్రసాదరావు 'పన్నులు యివ్వం', సి.వి.కృష్ణారావు 'నోటీసు', అట్లూరి పిచ్చేశ్వరరావు 'విముక్తి', రాంషా 'మస్తానయ్య మరణం' తదితర కథలను పేర్కొని అవి పోరాటకాలాన్ని చిత్రించిన తీరును ఆసక్తికరంగా విశ్లేషించారు రచయిత. పోరాటకాలంలోని ప్రజానీకం చేసిన త్యాగాలు, సాహసాలు, సంఘం తీసుకొచ్చిన చైతన్యం ఈ కథల్లో ప్రతిబింబించిన తీరును విశ్లేషించారు. ఈ కథల్లోని వస్తువు, పాత్రల ఆధారంగా రచయిత జరిపిన పరిశీలన ప్రయోజనకరంగా ఉంది. ఆయా కథల విశిష్టతను పాఠకులకు హత్తుకునేలా వివరించడం ప్రశంసనీయం.

పోరాట విరమణ కాలపు కథలుగా రచయిత కొన్ని కథలను విశ్లేషించారు. వాటిలో ఉప్పల లక్ష్మణరావు రాసిన 'గెరిల్లా' కథపై విశ్లేషణ బావుంది. చివరి అధ్యాయంగా కథన విశేషాలు శీర్షికన ఆయా కథల్లోని కథనాన్ని రచయిత విశ్లేషించిన తీరు ప్రశంసనీయం. ఆనాటి పరిస్థితులను కళ్ళకు కట్టించిన కథల గురించి వివరంగా పరిశీలన చేసిన ఈ పుస్తకం ప్రయోజనకరమైంది. అందరూ చదవదగ్గది.

(తెలంగాణా పోరాట కథలు,
సమ్మెట నాగమల్లీశ్వరరావు, పేజీలు: 146, వెల: రూ.60/-,
ప్రతులకు: మోతీ బుక్స్, ప్రజాశక్తి బుక్‌హౌజ్, నవోదయా బుక్ హౌజ్)

- వొరప్రసాద్

నీటిగోస
రచన : ఆర్. సత్యనారాయణ
పేజీలు : 155
ప్రతులకు :
రీజినల్ డెవలప్‌మెంట్ ఫోరం
జి-16, పల్లవి అపార్ట్‌మెంట్స్
బాలానగర్
హైదరాబాద్ - 42.



ప్రజాస్వామ్యం- అభివృద్ధి
బి.సి. కులాల దృక్పథం
డా॥ ఐ. వెంకటేశు
గుడిమెట్ల గోపాలకృష్ణ
వెల : 50/-, పేజీలు : 130
ప్రతులకు :
విశాల సాహితీ అకాడమీ
యూనివర్సిటీ ఆఫ్ సోషల్ ఫిలాసఫీ
బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్

వాటర్ మిలన్ జ్యూస్

కావలసిన పదార్థాలు

పుచ్చకాయ గుజ్జు	:	ఆరు కప్పులు
పంచదార	:	రెండు కప్పులు
ఎసెన్సు	:	ఒక స్పూన్

తయారుచేసే పద్ధతి

ముందుగా పుచ్చకాయను కడిగి, తుడిచి, పైచెక్కు తీసేయాలి. తర్వాత ముక్కలుగాకోసి గింజలన్నీ తీసేయాలి. ముక్కల్లో పంచదారవేసి కలిపి మిక్సీలో వేసి జ్యూస్ చేసుకోవాలి. దీన్ని ఫ్రిజ్‌లో పెట్టుకుని ఎండ సమయంలో తాగితే వేడి తగ్గి చలవచేస్తుంది.

తోటకూర పరోటా

కావలసిన పదార్థాలు

తోటకూర తరుగు	:	నాలుగు కప్పులు
గోధుమపిండి	:	నాలుగు కప్పులు
కొత్తిమీర తరుగు	:	అర కప్పు
ఉల్లిపాయ ముక్కలు	:	ఒక కప్పు
అల్లం, వెల్లుల్లి పేస్టు	:	ఒక స్పూను
పచ్చిమిర్చి	:	ఐదు
ఉప్పు	:	తగినంత
నూనె	:	సరిపడినంత

తయారుచేసే పద్ధతి

గోధుమపిండిని ఒక బేసిన్‌లోకి తీసుకుని ఉప్పువేసి చపాతీపిండిలా కలుపుకుని మూతపెట్టి పక్కనుంచాలి. తర్వాత పొయ్యిమీద ప్యాన్‌పెట్టి రెండుస్పూన్ల నూనె వేసి కాగనివ్వాలి. అందులో ఉల్లి, మిర్చి, తోటకూర తరుగు వేయాలి. ఉప్పు కూడా వేసి మూతపెట్టి బాగా దగ్గరగా అయ్యేంతవరకూ ఉడకనివ్వాలి. దించేముందు బాగా కలిపి కొత్తిమీర వేయాలి. ఇది చల్లారాక చపాతీపిండితో చిన్నచిన్న చపాతీలుగా చేసి అందులో కొంచెం తోటకూర ముద్దపెట్టి దగ్గరగా మడవాలి. వీటిని రెండువైపులా కాలేలా నూనెలో వేయించాలి. వేడివేడిగా తింటే ఇవి

- పి.జ్యోతి

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : జి.అశోక్‌కుమార్ గౌడ్
వయసు : 13 సం॥
చదువు : 7వ తరగతి
స్కూలు: జడ్.పి.హెచ్.స్కూల్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: బొమ్మలు వేయడం
చిరునామా : జి.అశోక్‌కుమార్ గౌడ్, సన్నాఫ్ రాజవర్ధన్ గౌడ్, అజ్జకొల్లు, కొత్తకోట (మం), మహబూబ్‌నగర్ జిల్లా. 509110.

పేరు : బందిల అంబేద్కర్
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: పేపర్ చదవడం, చెస్, షటిల్ ఆడడం
చిరునామా: బి.అంబేద్కర్, సన్నాఫ్ అబ్రహం, చినకాకాని (పోస్ట్), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా. 522 503.

పేరు : ఎం.లాల్‌అహమ్మద్
వయసు: 16 సంవత్సరాలు
చదువు : 10వ తరగతి
లక్ష్యం: కండక్టర్ అవడం
హాబీలు: ప్రజాశక్తి చదవడం, టీవీ చూడడం.
చిరునామా : ఎం.లాల్‌అహమ్మద్, సన్నాఫ్ ఇస్మాయిల్, హౌస్ నం: 12-70, కోట వీధి, కోడుమూరు (పోస్ట్ & మం), కర్నూలు జిల్లా. 518 464.

పేరు : కుప్పనబోయిన వెంకట రమణయ్య
చదువు : 10వ తరగతి
స్కూలు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెలిగండ్ల.
హాబీలు: చదవడం, పాటలు పాడడం
చిరునామా : కె.వెంకట రమణయ్య, సన్నాఫ్ వెంకటేశ్వర్లు, రామగోపాలపురం (పోస్ట్), వెలిగండ్ల (మం), ప్రకాశం జిల్లా.

పేరు : గౌరవేని అనిల్‌కుమార్
వయసు: 11 సంవత్సరాలు
చదువు: 6వ తరగతి
స్కూలు: ఆదర్శ విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: ప్రజాశక్తి చదవడం, రాయడం, క్రికెట్ ఆడడం.
చిరునామా : జి.అనిల్‌కుమార్, సన్నాఫ్ సాంబయ్య, నంగునూర్ (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.

పేరు : చింతలచెరువు స్రవంత్‌కుమార్
వయసు : 7 సం॥
చదువు: 2వ తరగతి
స్కూలు : గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఏన్కూరు.
లక్ష్యం: డాక్టర్‌కానీ పోలీస్ కానీ అవడం
హాబీలు: చదవడం, ఆడడం, టీవీ చూడడం.
చిరునామా : సిహెచ్ స్రవంత్‌కుమార్, సన్నాఫ్ శంకరరావు, పెద్దబీరవల్లి (పోస్ట్), బోనకల్ (మం), ఖమ్మం జిల్లా.

పేరు : జి.తేజశ్విని
వయసు : 10 సం॥
చదువు: 5వ తరగతి
స్కూలు : లయోలా యు.పి స్కూల్
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం.
చిరునామా : జి.తేజశ్విని, డాటరాఫ్ కృష్ణమోహన్, తిరువూరు (పోస్ట్), రాజుపేట, కృష్ణా జిల్లా. 521 235.